ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 19.10.2026 | సంపుటి : 13 సంచిక : 90 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఓట్‌చోర్ జ్ఞానేశ్‌ను రక్షిస్తే.. మోదీ సర్కారు

# మూల్యం చెల్లించకతప్పదు

### వారంతా త్వరలోనే చట్టం ముందు నిలబడతారు



"ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్, అసోంలలో ఓటు చోరీ జరిగిందని ఆధారాలతో సహా నిరూపించాం.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది" - రాహుల్ గాంధీ



- కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తిగానే ఉంటుంది
- బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు ప్రయోజనాలు చేకూరుస్తోంది
- గోవాలో పేదరైతుల భూములు లాక్కుంటున్నారు
- కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాద యాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి మిగతా 2లో..

# ప్రశ్నిస్తే వ్యభిచారిణి అవుతుందా?

### ఛీ.. ఏబీపీ గోదీ మీడియా!




జానపద గాయని నేహా సింగ్ రాథోర్‌ను కాల్‌గర్ల్‌గా చిత్రీకరించే యత్నం సిగ్గుచేటు



ఆమె ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఆ వార్తా సంస్థ కుట్ర

- మహిళలను గౌరవించే దేశంలో ఇదెంతటి నీచమైన ప్రచారం?
- ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిత్వ హననానికి దిగుతారా?

ప్రశ్నించే మహిళను ఎదుర్కోలేక ఆమెపై 'ప్రాసిట్యూట్', 'కాల్‌గర్ల్' ముద్రలు వేయడమేనా మీ జర్నలిజం? ప్రజా సమస్యలపై ప్రశ్నలు సంధించే నేహా సింగ్ రాథోడ్‌ను కించపరిచేలా ప్రచారం చేయడం ఏ రకమైన మీడియా సంస్కృతి? విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యతను విస్మరించి, ఒక మహిళ గౌరవాన్ని కించపరిచే పదజాలంతో దాడి చేయడం సిగ్గుచేటు.

న్యూఢిల్లీ (జనంసాక్షి): మహిళలను గౌరవించాలని బోధించే దేశంలోనే ప్రశ్నించే మహిళపై ఇలాంటి అవమానకర ప్రచారం సాగడం ఎంతటి విషాదకరం! మహిళను దేవతగా పూజిస్తామని చెప్పే సమాజంలో, తన అభిప్రా యాన్ని వ్యక్తం చేసినందుకు ఆమెను కించ పరచడం ఎలాంటి ద్వంద్వనీతి? మహిళల గౌరవం పండుగల నినాదాల్లోనేనా? ఆచరణలో మాత్రం ప్రశ్నించే మహి ళను అవమానించడమేనా? నేహాసింగ్ రాథోడ్ అభిప్రాయాలతో విభేదించే హక్కు అందరికీ ఉంది. ఆమె వాదనలను తప్పుబట్టవచ్చు, ఆధారాలతో ఖండించవచ్చు. కానీ ఆమెను లైంగికంగా కించపరిచే పదాలతో చిత్రీకరించడం మాత్రం విమర్శ కాదు, వ్యక్తిత్వ హననం. ఆరోపణలను మిగతా 2లో..

### భారత ఆర్మీ రహస్య సమాచారాన్ని

# విదేశాలకు అమ్మేసిన ఆర్మీ అధికారి భార్య

### ఆర్మీ అధికారి భార్య పాలపర్తి నాగ అనఘ లక్ష్మిపై కేసు



- చైనా అనుసంధానాలపై దర్యాప్తు..
- పరిశోధన పేరుతో రక్షణ, భౌగోళిక రాజకీయ అంశాలపై సమాచారం సేకరించారన్న అనుమానాలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని విదేశీ గూఢచార సంస్థలకు చేరవేశారన్న ఆరోపణలపై తెలంగాణకు చెందిన పాలపర్తి నాగ అనఘ లక్ష్మి అనే మహిళపై జమ్మూ కశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె భారత సైన్యంలో పనిచేస్తున్న ఓ మేజర్ స్థాయి అధికారి భార్యగా వార్తా కథనాలు పేర్కొన్నాయి. చైనాతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులతో ఆమెకు పరిచయాలు ఉన్నాయా? పరిశోధన పేరుతో సేకరించిన సమాచారం విదేశీ గూఢచారులకు చేరిందా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. జమ్మూలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో అక్టోబర్ 16న కేసు నమోదైనట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. అధికారిక రహస్యాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపినట్టు కథనాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థలతో మిగతా 2లో..

# ప్రజా సంక్షేమమే అజెండా

- అభివృద్ధి, పథకాలతో పేదలకు భరోసా..
- భద్రాచలం అభివృద్ధికి రూ.276 కోట్లు
- ప్రతి కుటుంబం బాగుండటమే లక్ష్యం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు
- విద్యార్థుల భవిష్యత్తే.. మన రాష్ట్ర భవిష్యత్తు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



ఖమ్మం(జనంసాక్షి): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామదాసు నాయక్ పట్టుదలతో ఈ రహదారికి మిగతా 2లో..

## స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ దోపిడీ

### టికెట్ ధరలు పెంచి పండుగ సంబురం లేకుండా చేశారు: హరీశ్‌రావు



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ టికెట్ ధరలను పెంచి ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దారుణమన్నారు. మిగతా 2లో..

## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు

2లో..

### ట్యాంక్ బండ్‌పై

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



### హాజరైన గవర్నర్, మంత్రి సీతక్క, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగుతున్నాయి. హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై భాషా సాం స్కృతికశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి సీతక్కతోపాటు 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఏర్పాటుచేసిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
హైదరాబాద్(జనంసాక్షి)

12లో..

# నాది తప్పే..

### భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను.. జేడీ వాన్స్ పశ్చాత్తాపం



వాషింగ్టన్(జనంసాక్షి): కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ.. పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 'భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ప్రసంగంలో ఏమైనా లోపాలు ఉంటే.. అది నా తప్పే. హెచ్-1బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు. అమెరికా కంపెనీలు, వీసా వ్యవస్థ మిగతా 2లో..

## ప్రపంచ ఇంధన సరఫరాను ఇరాన్ అడ్డుకుంటోంది

2లో..

అమెరికా కలగజేసుకోకపోతే పెట్రో ధరలు ఇప్పటికంటే మూడు రెట్లు అధికంగా ఉండేవి:జేడీ వాన్స్

# ఇది ప్రపంచానికి మేలు చేసే నిర్ణయం

- రష్యా ఇంధనం కొనుగోలు చేస్తున్న దేశాలకు ఆంక్షల నుంచి మినహాయింపును సమర్థించుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఫ్రాన్స్‌లో అశాంతికి వలసదారులే కారణమని వెల్లడి



వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా ఇంధనం కొనుగోలు చేస్తున్న దేశాలకు ఆంక్షల నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఇది అమెరికాతో పాటు ప్రపంచానికి మేలు చేసే నిర్ణయమని పేర్కొన్నారు. దీని వెనుక ఉన్న ఉద్దేశాన్ని చాలామంది ఇంకా అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించాల్సిన ఆంక్షల నుంచి మినహాయింపు ఇస్తూ శుక్రవారం ట్రంప్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే ప్రధాన ఐదు దేశాలపై విధించాల్సిన 100 శాతం సుంకాల అమలును నిలిపివేశారు. ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై మిగతా 2లో..

### భారత్‌కు రష్యా చమురు నిలుపుదల..

## అది ఒక్క రోజులో సాధ్యంకాదు

- భారత్ ఒక్క రాత్రిలో రష్యా చమురుకు దూరం కాలేదు
- ప్రపంచదేశాలపై సుంకాల తర్వాత ప్రభావంపై విశ్లేషణకు 2 నెలల సమయం పట్టొచ్చు
- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

వాషింగ్టన్(జనంసాక్షి): రష్యాపై ఆంక్షల్లో భాగంగా ఇతర దేశాలపై సుంకాలు విధిస్తే యూఎస్, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో విశ్లేషించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 60 రోజుల సమయం తీసుకోవాలని భావిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మిగతా 2లో..



# రష్యాపైకి డ్రోన్ల దండు..

### మంటల్లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇంధన టెర్మినల్!

### ఒకరి మృతి.. పలువురికి గాయాలు

మాస్కో(జనంసాక్షి):రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్ మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ మిగతా 2లో..

భారత్‌కు రష్యా చమురు నిలుపుదల..

## అది ఒక్క రోజులో సాధ్యంకాదు

మార్కో రూబియో తెలిపారు. ఉజ్బెకిస్థాన్, భారత్‌లో వారం రోజుల పర్యటనకు బయలుదేరే ముందు ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'లిండ్సే ఓ గ్రాహం చట్టం'లోని నిబంధనలపై ట్రంప్ ఇచ్చిన మినహాయింపుల విషయంలో ప్రశ్నలకు రూబియో స్పందించారు. ఈ చట్టంలోని కీలక నిబంధనల అమలుకు ట్రంప్ తాత్కాలిక మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. రష్యా ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించుకొనే దిశగా భారత్ ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో భాగంగానే వేర్వేరు ఇంధన విక్రేతలను ఆశ్రయిస్తోందని రూబియో అన్నారు. అయితే.. భారత్ లాంటి పెద్ద దేశం రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను రాత్రికి రాత్రే పూర్తిగా మళ్లించడం సాధ్యం కాదని తెలిపారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన మిత్రదేశమని, భాగస్వామి అని మార్కో రూబియో పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ అధ్యయనం చేసి, ఆంక్షలు, సుంకాల విషయంలో సరైన నిర్ణయం తీసుకునేందుకు ట్రంప్ 60 రోజుల సమయం పడుతుందని రూబియో వివరించారు.

**భారత్‌కు ట్రంప్ ఊరట**

ఈ చట్టంలో మినహాయింపులకు గల కారణాలను వివరిస్తూ.. ఇరాన్ యుద్ధం వల్ల అంతర్జాతీయ ఇంధన సరఫరాపై పెరుగుతున్న ఒత్తిడి, సౌదీ అరేబియా చమురు క్షేత్రాలపై హూతీ తిరుగుబాటుదారుల దాడులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ పరిణామాలను అమెరికా పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చిందని రూబియో వివరణ ఇచ్చారు. గ్రాహం చట్టాన్ని రూపొందించినప్పుడే ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను అధ్యయనం చేసేందుకు మినహాయింపులు కల్పించినట్లు రూబియో వివరించారు.

## నాది తప్పే..

గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్-1బీ వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని పేర్కొంటాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కవు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది' అని వాన్స్ పేర్కొన్నారు.

**నాడు వాన్స్ ఏమన్నారంటే..?**

హెచ్-1బీ వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్లు'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం తెలిపింది. నిపుణుల తరలింపు.. భారతీయులకు అవకాశాలు కల్పించడంతో పాటు అమెరికా కంపెనీల సంపదను కూడా పెంచుతోందని పేర్కొంది. ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగకల్పన వంటి విషయాల్లో కంపెనీలకు అత్యాధునిక ప్రతిభ ఎంతో సహాయకారిగా ఉందని వ్యాఖ్యానిచింది. ఈ విషయంపై వాన్స్ అనవసరంగా మాట్లాడారని అభిప్రాయపడింది.

## ప్రపంచ ఇంధన సరఫరాను ఇరాన్ అడ్డుకుంటోంది

**అమెరికా కలగజేసుకోకపోతే పెట్రో ధరలు**

**ఇప్పటికంటే మూడు రెట్లు అధికంగా ఉండేవి:జేడీ వాన్స్**

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సీబీఎస్ టౌన్ హాల్‌లో మాట్లాడుతూ..అమెరికా-ఇరాన్ ఘర్షణలపై కీలక వ్యాఖ్యలు చేశారు. హర్ముజ్ జలసంధి నుంచి చమురు, గ్యాస్‌ను అమెరికా నౌకాదళం తరలించకుండా ఉండి ఉంటే, పెట్రోల్ ధరలు ఇప్పటికంటే మూడు రెట్లు అధికంగా ఉండేవన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాను పూర్తిగా అడ్డుకోవడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించడానికి ప్రయత్నించిన 97 శాతం నౌకలు ఇరాన్ క్షిపణుల దాడులకు గురికాకుండా సురక్షితంగా ప్రయాణించాయని, వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్నప్పటికీ ఈ వ్యూహాత్మక నౌకా రవాణా మార్గం తెరిచే ఉందని అమెరికా సైన్యం పేర్కొంది.

టగ్‌బోట్‌పై దాడి..హెచ్చరికలు జారీ చేసిన యూకేఎమ్‌టీఓ

యూఏఈలోని ఖోర్ ఫక్కాన్ పోర్టు సమీపంలో సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న టగ్‌బోట్‌పై దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. గుర్తు తెలియని రెండు పరికరాలు బోటును ఢీకొట్టడంతో అది దెబ్బతిందని.. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న నౌకలు జాగ్రత్తగా ఉండాలని.. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని యూకేఎమ్‌టీఓ సూచించింది. మరోవైపు శనివారం సౌదీ అరేబియాలోని అల్ జుబైల్ సమీపంలో ఓ నౌకను గుర్తు తెలియని పరికరం ఢీకొట్టినట్లు తెలిపింది. నౌకలోని సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది.

## ఇది ప్రపంచానికి మేలు చేసే నిర్ణయం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింసాత్మక ఘటన లతో ఆ దేశం భగ్గుమంటోం దన్నారు. పూర్తిగా భిన్నమైన ప్రపంచం నుంచి వచ్చి, ద్వేషంతో ఉన్న వలసదారులే వీటికి కారణమని ఆరోపించారు. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నారని మండిపడ్డారు. మరీ ఆలస్యం కాకముందే దేశ సరిహద్దులను మూసివేసి నియంత్రణలోకి తెచ్చుకోవాలని ఆ దేశ నాయకత్వానికి సూచించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.ఫ్రాన్స్ అల్లర్లపై ట్రంప్ స్పందించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల ఓ సందర్భంగా ఆందోళనలను ప్రస్తావిస్తూ.. వ్యంగ్యంగా మాట్లాడారు. అదో అందమైన దేశమని, అక్కడ ఎలాంటి ఆందోళనలు, ఉద్యమాలు ఉండవని ఎద్దేవా చేశారు. విప్లవాలకు ఆదో మంచి ప్రదేశమని, అక్కడకు వెళ్లి ఆందోళనల్లో పాల్గొందామని హాస్యంగా చెప్పారు. మరోవైపు, ఆ దేశంలో అశాంతికి వలసలే కారణమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా పరోక్షంగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

కోల్‌కతా తొక్కిసలాట ఘటన..

## మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు

- బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హామీ
- ఘటనపై దర్యాప్తుకు 'సిట్' ఏర్పాటు

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపంవద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట లో 19మంది మృతిచెందారు. ఈ క్రమంలో ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిర్వాహక కమిటీ సభ్యులతో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నిర్లక్ష్యం వల్ల నిర్వహణ చర్యల్లో లోపాలు చోటు చేసుకొన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన 25మందిని మెరుగైన చికిత్స కోసం కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదం నేపథ్యంలో చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపాన్ని మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాలలోని ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.



**దర్యాప్తునకు సిట్ ఏర్పాటు..**

బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్ కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై దర్యాప్తునకు కలకత్తా హైకోర్టుకు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (రామి), ఫ్యాక్ట్-ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సిట్‌లో ఎస్‌టీఎఫ్, సీఐడీ సహా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రూ.25 లక్షల పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. గాయపడిన వారికి అయ్యే పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

# ఓట్ చోర్ జ్ఞానేశ్‌ను రక్షిస్తే మోదీ సర్కారు మూల్యం చెల్లించక తప్పదు

పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు."ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయి. వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులే ఉన్నాయి. అయితే, ప్రధానమంత్రి ఓటు చోరీకి పాల్పడ్డారని నా ఆరోపణపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే వెనుకడుగు వేస్తున్నారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్?, అసోంలలో ఓటు చోరీ జరిగిందని ఆధారాలతో సహా నిరూపించాం. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేర్చారు. ఓటర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి అక్రమాలు జరిగాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది" అని అన్నారు




**'అదానీ, అంబానీలకు ప్రయోజనాలు'**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

**'గోవాలో భూములు లాక్కుంటున్నారు'**

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు

**యువతను వెలివేసే వ్యవస్థ'**

దేశంలోని విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డబ్బు అధికారం లేనివారిని, ఆంగ్లంలో మాట్లాడలేని వారిని ప్రస్తుత వ్యవస్థ పక్కన పెడుతోందని విద్యార్థులతో తన సంభాషణకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. లక్షలాది మంది భారతీయ యువతకు విద్యా అవకాశాలు దక్కకుండా చేసే విధానాన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమని వ్యాఖ్యానించారు.

# ప్రశ్నిస్తే వ్యభిచారిణి అవుతుందా?



వాస్తవాలుగా ప్రచారం చేయడానికి ముందు వాటి నిజానిజాలను నిర్ధారించడం మీడియా కనీస బాధ్యత.ఏబీపీ న్యూస్ పేరుతో ప్రచారమవుతున్న ఈ అంశంపై ప్రశ్న ఒక్కటే.. మహిళను అవమానించే ప్రచారంతో ఏం సాధించాలనుకుంటున్నారు? ప్రశ్నకు జవాబు చెప్పండి.. వ్యక్తిత్వంపై బురదజల్లకండి. ప్రశ్నించడం నేరం కాదు. మహిళను కించపరచడం జర్నలిజం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును గౌరవించడమే నిజమైన మీడియా బాధ్యత..!తాను ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే, తనను అవమానకర రీతిలో చిత్రీకరించేందుకు ఆ కవరేజ్ ప్రయత్నించిందని ఆమె ఎక్స్ ఛానెల్‌లోని పోస్టులలో ఆరోపించారు. జాతీయ మహిళా కమిషన్‌ను కూడా ట్యాగ్ చేస్తూ.. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటారా అని రాథోడ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారం ఇంతటితో ముగిసిపోదని ఆమె స్పష్టం చేశారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే..**

తాను ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే, తనను అవమానకర రీతిలో చిత్రీకరించేందుకు ఆ కవరేజ్ ప్రయత్నించిందని ఆమె ఎక్స్ ఛానెల్‌లోని పోస్టులలో ఆరోపించారు. చానెల్ పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం కావడంతో ఏబీపీ నెట్‌వర్క్ ఆమెపై ప్రచురించిన ఒక నివేదికకు క్షమాపణలు చెప్పింది. ఆ నివేదికలో వాస్తవ దోషాలు ఉన్నాయని నెట్‌వర్క్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అంగీకరించి, దాని ప్రచురణ పట్ల విచారం వ్యక్తం చేసింది. తన గౌరవానికి, ప్రతిష్టకు భంగం కలిగించే కంటెంట్‌ను ప్రచురించిందని ఛానల్‌పై ఆరోపించిన రథోర్ అభ్యంతరాల నేపథ్యంలో ఈ వివరణ వెలువడింది.

## రష్యాపైకి డ్రోన్ల దండు..

టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు.. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రంప్ 'ఇంధన కాల్పుల విరమణ' ప్రకటించిన వారం రోజుల్లోనే తమ ఇంధన, చమురు, గ్యాస్ సదుపాయాలపై రష్యా 76 సార్లు దాడులకు తెగబడిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. విద్యుత్ బ్లాక్‌అవుట్ సృష్టించేందుకు మాస్కో యత్నిస్తోందని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎటువంటి సానుకూల చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించాలన్నారు.

## నేడు.. రేపు వర్షాలు

**పలు జిల్లాల్లో కురిసిన వర్షం**

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో నేడు, రేపు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల పరిధిలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. మంగళ, బుధవారాల్లోనూ పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం, దక్షిణ కోస్తాంధ్ర నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి కారణంగా వర్షాలు కురిసే వీలుందని పేర్కొంది. మరోవైపు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

## ఘనంగా ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు

శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రి జూపల్లి కృష్ణారావు, యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, సినీనటులు విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పాల్గొన్నారు. ట్యాంక్ బండ్ వద్ద మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ ఆడారు. ఈ వేడుకల్లో ప్రముఖులు పాల్గొవడం సంతోషంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బతుకమ్మ పూలను పూజించే పండుగ అని తెలిపారు. ఈ పండుగను పర్యావరణ హితంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. మన పండుగలు, కళారూపాలను ప్రపంచానికి, బావి తరాలకు పరిచయం చేయడం మన బాధ్యతని ఆయన వివరించారు. జానపద గేయాలు కూడా విస్తృత ప్రచారం పొందు తున్నాయన్న జూపల్లి , కవులు కళాకారులు, గేయ రచయితలు తెలంగాణకు అస్తిత్వాలన్నారు.సద్దుల బతుకమ్మ వేడుకల్లో రష్మిక, విజయ్?ల జంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరో విజయ్ దేవరకొండ మట్లాడుతూ 'అందరికీ దసరా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు, బతుకమ్మను చూస్తే చాలా ముద్దుగా అనిపిస్తుంది. ఇంట్లో వాళ్లు బతుకమ్మను చేస్తుంటారు. తెలంగాణలో పెద్ద బతుకమ్మ దగ్గరకు తీసుకువెళ్లి రష్మికను ఆడిస్తానని ఆమెకు మాట ఇచ్చాను. మన పండుగలు ఇంత జోరుగా జరిపిస్తుంటే సంతోషంగా అనిపిస్తుం ది. రష్మిక బతుకమ్మను ఆడుతుంటే చూడాలని ఉంది' అని అన్నారు.

## స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ దోపిడీ..

ఈ మేరకు హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు టికెట్ ధర రూ.230 ఉంటే ఏకంగా రూ.400కు పెంచారన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ.220 ఉంటే.. ఇప్పుడు రూ.290కి పైగా వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి జేబులు గుల్ల చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్ గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారని.. ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు.

## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు

ముంబయి(జనంసాక్షి): బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు జరిగాయి. ఆదివారం సాయంత్రం టైగర్ కారులో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి తెగబడ్డారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు తుపాకీతో వరుసగా కాల్పులు జరిపారు. టైగర్ ష్రాఫ్, అతని కారు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. వెంటనే సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయారు. ఈ మేరకు జుహు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముంబయి పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరు? ఎందుకు చేశారు? అన్న వివరాలు తెలియాల్సి ఉంది.

భారత ఆర్మీ రహస్య సమాచారాన్ని విదేశాలకు

## అమ్మేసిన ఆర్మీ అధికారి భార్య

అనుమానాస్పద సంబంధాలు, సున్నితమైన సమాచారం సేకరణ, దాని బదిలీ జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**పరిశోధన పేరుతో పరిచయాలు?**

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, అనఘ లక్ష్మి పరిశోధనకు సంబంధించిన కొన్ని కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తించారు. విద్యావేత్తలు, పరిశోధకులుగా పరిచయం చేసుకున్న వ్యక్తులతో ఆమెకు సంబంధాలు ఉన్నాయా? ఆ పరిచయాల వెనుక విదేశీ గూఢచార సంస్థల ప్రమేయం ఉందా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు వార్తా కథనాలు తెలిపాయి.ప్రాథమిక దర్యాప్తులో రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై ఆమె రూపొందించిన పరిశోధనా పత్రాలు, ఇతర డిజిటల్ సమాచారాన్ని పరిశీలిస్తున్నట్లు పీటీఐ వార్తా కథనం పేర్కొంది. చైనాకు అనుసంధానమున్న వ్యక్తులతో సంబంధాలున్నాయన్న అనుమానాలపైనా విచారణ సాగుతోంది.కొన్ని వార్తా కథనాల ప్రకారం, జాతీయ భద్రత, రక్షణ రంగం, సరిహద్దు పరిస్థితులు, వ్యూహాత్మక ప్రాజెక్టుల వంటి అంశాలపై పరిశోధనా పత్రాలు రూపొందించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ రచనల్లో కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించినట్లు కూడా పీటీఐ కథనం పేర్కొంది. అయితే, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఏయే రహస్య పత్రాలు విదేశీ సంస్థలకు చేరాయన్నది ఇంకా నిర్ధారణ కాలేదు.అనఘ లక్ష్మి తెలంగాణలోని సికింద్రాబాద్‌కు చెందినవారని వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఆమెకు అంతర్జాతీయ సంబంధాలు, పరిశోధనా రంగాల్లో విద్యాభ్యాసం, అనుభవం ఉన్నట్లు పీటీఐ కథనం తెలిపింది. ఆమె వ్యక్తిగత డిజిటల్ పరికరాల్లోని సమాచారాన్ని పరిశీలించడం సహా ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వార్తలు వెల్లడించాయి.ఈ కేసులో కీలకమైన విషయం ఏమిటంటే, అనఘ లక్ష్మి విదేశీ గూఢచార సంస్థలకు నిజంగానే రహస్య సమాచారాన్ని చేరవేశారన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. పీటీఐ ప్రచురించిన సమాచారం ప్రకారం, ఆమెను విచారించినప్పటికీ అప్పటికి సున్నితమైన సమాచారం బదిలీ చేసినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కాలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఆమెను అరెస్టు చేసినట్లు కూడా ఆ కథనం పేర్కొనలేదు. అందువల్ల ఆరోపణలను నిర్ధారిత నేరంగా పేర్కొనలేం.ఈ వ్యవహారంలో ఆమె భర్త అయిన ఆర్మీ అధికారి పేరును కూడా అందుబాటులో ఉన్న విశ్వసనీయ వార్తా కథనాలు వెల్లడించలేదు. దర్యాప్తు పూర్తయి వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే ఈ కేసులో అసలు సమాచారం ఏ మేరకు బదిలీ అయింది, విదేశీ సంస్థల ప్రమేయం ఉందా అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ప్రజా సంక్షేమమే అజెండా

నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

ప్రజల కుటుంబ అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా కేటాయించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భారం పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.నీటిని పొదుపుగా వినియోగించాలి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను



పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలతో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు.

**మరో బీటీ రోడ్డు మంజూరుకు హామీ**

వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులను మంజూరు చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. నాచారం గ్రామం నుంచి జూలూరుపాడు మీదుగా తల్లాడ?భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## సీఐ ఆంజనేయులు ఆస్తులు రూ.20 కోట్లపైనే

**అక్రమంగా కూడబెట్టినట్లు గుర్తించిన ఏసీబీ.. కేసు నమోదు**

హైదరాబాద్(జనంసాక్షి): స్టేషన్ బెయిలు ఇచ్చేందుకు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కీసర పూర్వ ఇన్‌స్పెక్టర్ అరకపల్లి ఆంజనేయులు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు తేలింది. ఇళ్లు, స్థలాలు, బంగారం కలిపి మొత్తం విలువ రూ.2.28 కోట్లని... మార్కెట్ ప్రకారం రూ.20 కోట్లకుపైగా ఉండొచ్చని సమాచారం. ఎల్బీనగర్ సమీప ప్రాంతాల్లోనే 540 చ.గజాల స్థలాలున్నాయి. ఇవన్నీ అక్రమాదాయంతోనే కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించి ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆంజనేయులు, అతని బంధువులు, బినామీలు నివాసాలున్న నాలుగు ప్రాంతాల్లో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించగా భారీగా ఆస్తులు బయటపడ్డాయి. సెప్టెంబరు 17న ఆంజనేయులును ఏసీబీ అరెస్టు చేసి జైలుకు పంపించింది.



# రైతు కూలీల బిడ్డలు డాక్టర్లు కావడం గర్వకారణం

- గురుకుల విద్యతో పేద విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం పలుగు తండాకు చెందిన నిరుపేద రైతు కూలీల దంపతులు వాడిత్య యాదు నాయక్, పాపీ బాయి కుమార్తెలు వాడిత్య నివేదిత, వాడిత్య అఖిల ఎంబీబీఎస్ సీట్లు సాధించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ కుటుంబ సభ్యులతో కలిసి తనను కలవడం ఆనందంగా ఉందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఒకప్పుడు వైద్య విద్య అభ్యసించాలంటే కోట్ల రూపాయల ఫీజులు, విరాళాలు చెల్లించగలిగే సంపన్నులకే సాధ్యమనే భావన ఉండేదని హరీశ్‌రావు అన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో కేసీఆర్ తెలంగాణవ్యాప్తంగా వందలాది గురుకులాలను ఏర్పాటు చేసి, కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించారని పేర్కొన్నారు. దీనికి తోడు జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 2,850 నుంచి 10 వేలకు పైగా పెంచిన నిర్ణయం అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. గురుకులాల్లో ఉచితంగా చదువుకుని వైద్య విద్యకు ఎంపిక కావడం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల బిడ్డలు నేడు విద్యా సంస్కరణల ఫలితంగా వైద్యులుగా ఎదిగేందుకు సిద్ధమవడం గర్వకారణమన్నారు. బడుగు, బలహీన వర్గాలు, గిరిజన తండాల పిల్లల జీవితాలను కేసీఆర్ విద్యా, సంక్షేమ విధానాలు ఎలా మారుస్తున్నాయో నివేదిత, అఖిల విజయం చాటిచెబుతోందని తెలిపారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన నివేదిత, అఖిలతో పాటు వారి తల్లిదండ్రులకు హరీశ్‌రావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత వైద్యులుగా ఎదిగి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# నిజామాబాద్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య సర్కిళ్ల పెంపు

**అంతర్గతంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (జనంసాక్షి) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య మెరుగుదల కోసం అధికార యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా నగరంలో ఇప్పటివరకు ఉన్న 5 సర్కిళ్లను 10 సర్కిళ్లుగా పెంచారు. నగరంలోని 50కి పైగా డివిజన్లను 5 జోన్లుగా విభజించి, అందుకు అనుగుణంగా కొత్త సర్కిళ్లను పునర్వ్యవస్థీకరించారు. కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ ఉత్తర్వుల మేరకు ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వచ్చాయి.

**పాత విధానానికి స్వస్తి.. 10 సర్కిళ్లకు ఎస్సైల నియామకం**

ఇప్పటివరకు 5 సర్కిళ్ల పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల (ఎస్సై) ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేది. అయితే, పరిపాలనా సౌలభ్యం, చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసేందుకు సర్కిళ్ల సంఖ్యను పెంచారు. కొత్తగా పదోన్నతులు పొందిన జవాన్లతో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా వివిధ సర్కిళ్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు అప్పగించారు.
ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో రెగ్యులర్ జవాన్లుగా పనిచేస్తున్న కుమార్, ప్రసాద్, లతీఫ్, రజాక్‌లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం ఎండీ షాదుల్లా హుస్సేన్ ఒక్కరే రెగ్యులర్ ఎస్సైగా పనిచేస్తుండగా, ప్రభుదాస్ ఎన్ఎంఆర్‌గా, మరికొందరు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్నారు.

**కొత్త సర్కిళ్లు.. ఎస్సైల కేటాయింపు వివరాలు**

పెంచిన సర్కిళ్ల ప్రకారం అధికారులకు డివిజన్లను కేటాయించారు. సర్కిల్ 1-ఎ ఇన్‌చార్జి ఎస్సైగా మహిపాల్‌కు 1, 15, 16, 17, 35, 36 డివిజన్లను కేటాయించారు. సర్కిల్ 1-బి బాధ్యతలను 23వ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై ఎన్. ప్రసాద్‌కు అప్పగించారు. ఈ సర్కిల్ పరిధిలో 37, 38, 39, 40, 43 డివిజన్లు ఉన్నాయి.
అలాగే, సర్కిల్ 2-ఎ ఎస్సైగా కుమార్‌కు 4, 5, 6, 7, 22, 24 డివిజన్లు, సర్కిల్ 2-బి ఎస్సైగా ప్రశాంత్‌కు 23, 25, 26, 45, 46, 47, 48 డివిజన్లు కేటాయించారు. సర్కిల్ 3-ఎ ఎస్సైగా శ్రీకాంత్‌కు 8, 9, 27, 28, 50 డివిజన్లు, సర్కిల్ 3-బి ఎస్సైగా కృష్ణకు 49, 51, 52, 56, 57, 58, 59 డివిజన్లు అప్పగించారు.
సర్కిల్ 4-ఎ డంపింగ్ యార్డు ఇన్‌చార్జి ఎస్సైగా ప్రభుదాస్‌కు 20, 21, 33,




44 డివిజన్లు, సర్కిల్ 4-బి ఎస్సైగా సునీల్ కుమార్‌కు 2, 3, 18, 19, 41, 42 డివిజన్లు కేటాయించారు.
సర్కిల్ 5-ఎ బాధ్యతలను ఎం.డి. షాదుల్లా హుస్సేన్‌కు అప్పగించగా, ఈ సర్కిల్ పరిధిలో 10, 11, 12, 13, 14, 30, 31 డివిజన్లు ఉన్నాయి. సర్కిల్ 5-బి బాధ్యతలను అబ్దుల్ రజాక్‌కు అప్పగించారు. ఈ సర్కిల్ పరిధిలో 32, 29, 53, 54, 55, 60 డివిజన్లు ఉన్నాయి. డివిజన్ నంబర్ 11 ఇన్‌చార్జి ఎస్సైగా ఉన్న లతీఫ్‌ను డంపింగ్ యార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

**వైద్యుని నియామకంలో నిర్లక్ష్యం.. నిరాశలో ప్రజలు**

పారిశుద్ధ్య నిర్వహణ కోసం సర్కిళ్లను పెంచినప్పటికీ, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెడికల్ హెల్త్ ఆఫీసర్ నియామకంపై మాత్రం యంత్రాంగం ఎలాంటి చొరవ చూపలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్‌లో ఎంహెచ్ఓగా ఎంబీబీఎస్ వైద్యుడు ఉండాల్సిన చోట, ఎస్సై క్యాడర్‌కు చెందిన ఉద్యోగితోనే కాలం వెళ్లదీస్తున్నారు.
ఎంహెచ్ఓగా వైద్యుడు లేకపోవడం వల్ల పారిశుద్ధ్యంతో పాటు పశు వధశాలలు, హోటళ్లపై పర్యవేక్షణ పూర్తిగా కరువైందని ప్రజలు వాపోతున్నారు. కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాతైనా అర్హుడైన వైద్యుడిని నియమిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని, ఐఏఎస్ కమిషనర్లు వస్తున్నప్పటికీ వైద్యుడిని నియమించకపోవడం దారుణమని సర్వత్రా చర్చ జరుగుతోంది.

# కెరమెరిల మండల వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**కెరమెరి,అక్టోబర్ 18(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ముగింపు వేడుకైన సద్దుల బతుకమ్మ వేడుకలు కెరమెరి మండల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి.
గ్రామ ప్రధాన కూడళ్లలో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడపడుచులు కోలాహలంగా నృత్యాలు చేశారు.
ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ... తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను కొలిచామని, చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజున బతుకమ్మలను నిమజ్జనం చేసి, తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నామని తెలిపారు.
బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, సోదరభావానికి నిదర్శనమని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేశారని అన్నారు.
ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# మాజీ ముఖ్యమంత్రి అంజయ్య జీవితం స్ఫూర్తిదాయకం

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు**



**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య 40వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని లుంబిని పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సామాన్య కార్మికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యున్నత పదవిని చేపట్టిన టి. అంజయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా అంజయ్య గుర్తింపు పొందారని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనసును చూరగొన్న నాయకుడిగా అంజయ్య నిలిచారని పేర్కొన్నారు. పేదల పెన్నిధిగా పేరుపొందిన ఆయన, ప్రజల సమస్యలను ఓపికగా వింటూ, విమర్శలను సైతం సహనంతో స్వీకరించే వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారని కొనియాడారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సామాన్య ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన అంజయ్య జీవితం నేటి తరం నాయకులకు మార్గదర్శకమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజలతో మమేకమై సేవ చేయడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి విలువలను ఆయన జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు పాల్గొని టి. అంజయ్యకు నివాళు లర్పించారు.

# తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత

- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందులు పడవద్దని రైతులకు హితవు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (జనంసాక్షి) :** ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక జలాశయాలలో నీటి నిల్వలు చేరని కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. భీంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పాల్గొన్న సందర్భంగా స్థానిక రైతులను ఉద్దేశించి సుదర్శన్ రెడ్డి పలు సూచనలు చేశారు. వర్షాభావం వల్ల భూగర్భ జలాలు సైతం గణనీయంగా పడిపోతున్నాయని, మునుముందు పంటల సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా సాగు జలాలు అందించామని, పూర్తి స్థాయిలో కరెంటు సరఫరా చేసి పంటలను కాపాడుకున్నామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఎల్ నినో వల్ల తీవ్ర విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన ఆవశ్యకత నెలకొనిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత యాసంగిలో వరి పంట వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి వేసుకుంటే సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, పప్పు దినుసు పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, భీంగల్ మున్సిపల్ చైర్మన్ నాగమణి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, తహసీల్దార్ కిరణ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, స్థానిక రైతులు ఉన్నారు.

# ఎంవీఎస్ఆర్ యాజమాన్యంపై హత్య కేసులు నమోదు చేయాలి

**బాధిత కుటుంబాలకు చెరో రూ.కోటి పరిహారం చెల్లించాలి**
**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దాండియా వేడుకల సందర్భంగా విద్యార్థిని సోనీ మృతి చెందడం, మరో విద్యార్థిని మీనా తీవ్రంగా గాయపడటానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. విద్యార్థుల భద్రతను విస్మరించిన బాధ్యులపై హత్య కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.
విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.350 వసూలు చేస్తూ వేడుకలు నిర్వహించిన యాజమాన్యం కనీస భద్రతా ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. అగ్నిమాపక భద్రత, తొక్కిసలాట నివారణ చర్యలు, ప్రథమ చికిత్స, అంబులెన్స్ సదుపాయాలు కల్పించకపోవడంపై ప్రశ్నించారు. కార్యక్రమానికి అనుమతులు ఇచ్చిన అధికారులు, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన పోలీసు, విద్యాశాఖ అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని కోరారు.
తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్ముతో లక్షల రూపాయల ఫీజులు చెల్లించేది పిల్లల భవిష్యత్తు కోసమేనని, ఇలాంటి దుర్ఘటనలు ఎదుర్కోవడానికి కాదని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల నిర్లక్ష్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోనీ కుటుంబానికి, గాయపడిన మీనా కుటుంబానికి చెరో రూ.కోటి పరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. మీనా పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. కళాశాల యాజమాన్యం, వేడుకల నిర్వాహకుల బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భద్రతా ఉల్లంఘనలు రుజువైతే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని దాసోజు శ్రవణ్ కుమార్ కోరారు.

# థార్ కారు ఢీకొని ఇద్దరు మృతి

**చిన్నారికి తీవ్ర గాయాలు**



**హయత్‌నగర్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** హయత్‌నగర్ బస్టాప్‌లోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మూడున్నరేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. వివరాల ప్రకారం.. టీజీ 07 పీ 2511 నంబరు గల థార్ కారు వేగంగా వచ్చి, టీజీ 07 జీ 2690 నంబరు గల స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో స్కూటీ థార్ కారు, డీసీఎం వాహనం మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో బైండ్ల రేఖ, ఎడుల్ల నవీన్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చిన్నారి సర్వితను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారి శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చీటింగ్, మనీ లెండింగ్ చట్టాల కింద ఆరుగురిపై కేసులు

**10 ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (జనంసాక్షి) :** నిజామాబాద్ సీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం పోలీసులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సుమారు 10 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.74 లక్షల 50 వేల నగదుతో పాటు పలు ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదు, పత్రాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తులను విచారించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆరుగురిపై చీటింగ్, మనీ లెండింగ్ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ కేసులపై తదుపరి విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.



# మాదాపూర్‌లోని 'యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్'లో అగ్ని ప్రమాదం



**శేరిలింగంపల్లి అక్టోబర్ 18 (జనంసాక్షి) :** మాదాపూర్ పరిధిలోని ప్రముఖ రక్షణ రంగ సాంకేతిక సంస్థ 'యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్ ఈరోజు సాయంత్రం సుమారు 5:00 గంటలకు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రోన్ నిరోధక పరీక్షా పరికరాలను సిద్ధం చేస్తున్న ఈ యూనిట్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కొద్దిసేపు కలకలం రేపింది.సకాలంలో స్పందించిన యంత్రాంగం.. ప్రాణనష్టం తప్పింది! సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక వాహనాలు (ఫైర్ ఇంజిన్స్ ) అత్యవసరంగా ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి, సకాలంలో స్పందించడంతో మంటలు మరింత వ్యాపించకుండా పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**ప్రమాదానికి గల కారణాలు..**

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉండటంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే, విద్యుత్ అంతరాయం కారణంగా కూలింగ్ సిస్టమ్ పనితీరుపై ప్రభావం పడి, బ్యాటరీలు వేడెక్కడం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు అనుమానిస్తున్నారు.
ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, అగ్నిప్రమాదానికి అసలు కారణం ఏంటన్నది సమగ్ర తనిఖీ, అధికారిక విచారణ తర్వాతే స్పష్టమవుతుందని పోలీసులు వెల్లడించారు.

# మలేషియాలో బతుకమ్మ సంబరాలు

**తెలుగు సంస్కృతికి ప్రవాసుల నీరాజనం**



**కౌలాలంపూర్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు మలేషియాలోని కౌలాలంపూర్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రవాస భారతీయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఎన్‌సీఏ) మలేషియా ఆధ్వర్యంలో బ్రిక్‌ఫీల్డ్స్‌లోని కందయ్య హాల్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు కుటుంబాలతో పాటు, దశాబ్దాలుగా మలేషియాలో స్థిరపడిన ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రముఖుల హాజరు.. బహుమతుల సందడి**

పెరాక్ రాష్ట్ర శాసనసభ సభ్యురాలు వాసంతి సిన్నిసామి, భారతీయ కార్మిక విభాగ ప్రతినిధి వినయ్ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ఇటువంటి వేడుకల ప్రాధాన్యాన్ని వారు వివరించారు. అందంగా అలంకరించిన బతుకమ్మకు రెండు బంగారు నాణేలు, బతుకమ్మలు తీసుకొచ్చిన మహిళలకు వెండి నాణేలను అందజేశారు. అదృష్ట పోటీలో విజేతలకు బంగారు, వెండి నాణేలు బహూకరించారు. చిన్నారుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగు వంటకాలతో విందు ఏర్పాటు చేశారు.

**సాంస్కృతిక వేడుకలతో పాటు సామాజిక సేవ**

ఎఫ్ఎన్‌సీఏ మలేషియా అధ్యక్షుడు కృష్ణ ముత్తినేని మాట్లాడుతూ.. బతుకమ్మ ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. విదేశాల్లో తెలుగు సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, ఇబ్బందుల్లో ఉన్న భారతీయులకు సహాయం చేయడం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. మలేషియా ప్రభుత్వం అమలు చేస్తున్న వలసదారుల స్వదేశీ పునరాగమన పథకం గడువు 2027 మే 31 వరకు పొడిగించినట్లు నిర్వాహకులు వివరించారు. అర్హతలు, చెల్లింపులు, ప్రయాణ నిబంధనలను సంబంధిత అధికారుల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మలేషియా తెలుగు సంఘాల ప్రతినిధులు, ఎఫ్ఎన్‌సీఏ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వివిధ సంస్థలు వేడుకలకు సహకరించాయి. పూల పండుగ ద్వారా ప్రవాస తెలుగు కుటుంబాల ఐక్యత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి.



# ఆధారాలుంటే బయటపెట్టండి

- కేసీఆర్‌పై బురదజల్లడం ఆపాలి
- వెలుగు కథనంపై బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ నాయకుడు గుర్రాల నాగరాజు ఖండన

**హైదరాబాద్ (జనంసాక్షి):** 'కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ' శీర్షికతో వెలుగు పత్రిక ప్రచురించిన కథనాన్ని బీఆర్ఎస్ ఎన్నారై దక్షిణాఫ్రికా శాఖ నాయకుడు గుర్రాల నాగరాజు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని పేర్కొన్నారు. ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.
ఏది రాసినా ప్రజలు నమ్ముతారనుకోవడం పొరపాటని నాగరాజు అన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆరోపణలు చేసేటప్పుడు వాస్తవాలను నిర్ధారించుకోవాలని, సంచలన శీర్షికలతో ప్రజలను తప్పుదోవ పట్టించకూడదని హితవు పలికారు. ప్రశ్నించే హక్కు పత్రికలకు ఉన్నట్లే, వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కూడా ఉందని పేర్కొన్నారు.
కేసీఆర్‌ను విమర్శించాలనుకుంటే ఆధారాలతో విమర్శించాలని, ఎలాంటి ఆధారాలు చూపకుండా ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేస్తే మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో వాటిని గట్టిగా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. వెలుగు పత్రిక యాజమాన్యం కథనానికి సంబంధించిన ఆధారాలను బహిర్గతం చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఆరోపణలను నిరూపించలేకపోతే కథనాన్ని ఉపసంహరించుకోవడంతోపాటు, మొదటి పేజీలో తగిన ప్రాధాన్యంతో బేషరతుగా క్షమాపణ ప్రచురించాలని కోరారు. అంతేకాకుండా డిజిటల్ వేదికలు, అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లోనూ వివరణ ఇవ్వాలని సూచించారు. పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తామని, అయితే ఆ స్వేచ్ఛతోపాటు బాధ్యత కూడా ఉండాలని నాగరాజు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు కావాల్సింది వాస్తవాలేనని, అపోహలు కాదని అన్నారు. ఆరోపణల్లోని నిజానిజాలు ప్రజల ముందే తేలాలని స్పష్టం చేశారు.



# ప్రశ్నిస్తే వ్యభిచారిణి ముద్ర వేస్తారా?

## స్టాండ్ విత్ నేహా సింగ్ రాథోడ్ - షేమ్ ఏబీపీ న్యూస్

*ప్రశ్నించడం నేరమా? అధికారాన్ని నిలదీయడం పాపమా? పాలకులను ప్రశ్నించినందుకు ఒక మహిళను కించపరిచేలా చిత్రీకరించడమే సమాధానమా? వాదనతో ఎదుర్కోలేని ప్రశ్నకు వ్యక్తిత్వ హననమే ఆయుధమా? ఇదేనా ప్రజాస్వామ్యం నేర్పిన సంస్కారం? ఇదేనా జర్నలిజం చెప్పిన విలువలు? నేహా సింగ్ రాథోడ్ వ్యవహారంపై వెలువడిన ప్రచారానికి సంబంధించి తలెత్తుతున్న ప్రశ్నలు మీడియా ప్రపంచాన్నే నిలదీస్తున్నాయి. ఆరోపణలు నిజమైతే, అది ఒక మహిళను అవమానించడమే కాదు, జర్నలిజం తన గొంతును తానే నులిమేసుకోవడమే!*

సంపాదకీయం

మహిళ ప్రశ్నకు సమాధానం చెప్పలేనివారు ఆమె వ్యక్తిత్వంపై దాడి చేస్తారా? ఆమె వాదనలో తప్పుంటే ఆధారాలతో ఖండించాలి. ఆమె విమర్శలో అసత్యం ఉంటే వాస్తవాలతో బయటపెట్టాలి. అంతేకానీ, ఆమెను నీచంగా చిత్రీకరించి, ఆమె గౌరవాన్ని బజారుకీడ్చి, ఆమె గొంతును మూయించాలని చూడటం ఏ రకమైన ప్రజాస్వామిక సంస్కృతి? ప్రశ్నకు సమాధానం చెప్పలేనివారి బలహీనతే వ్యక్తిత్వ హననంగా బయటపడుతుంది. మహిళను కించపరిచే మాటలతో ఆమె లేవనెత్తిన సమస్యను చెరిపేయలేరు. ఆమె గొంతును అవమానాలతో అణచలే రు. నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం లేనివారే ప్రశ్నించిన వ్యక్తిపై బురదజల్లుతారు.

ఇక్కడ మరో తీవ్రమైన ప్రశ్న ఉంది. మహిళల భద్రత, గౌరవం, సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇచ్చే మీడియా సంస్థలు, అదే మహిళను కించపరిచే ప్రచారానికి వేదికగా మారితే వాటి మాటలకు విలువ ఏముంటుంది? వార్తా సంస్థకు కెమెరా ఉంది, మైకు ఉంది, విస్తృత ప్రేక్షకలోకం ఉంది. ఆ శక్తిని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి వినియోగించాలా? లేక ప్రశ్నించే గొంతును అవమానాల ముసుగులో దెబ్బతీయడానికి ఉపయోగించా లా? మీడియా చేతిలోని మైకు ప్రజల గొంతుక కావాలి, వ్యక్తిత్వ హననానికి ఆయుధం కాకూడదు. న్యూస్ రూమ్ అధికారానికి వంతపాడే వేదికగా మారితే, అది జర్నలిజం కాదు; ప్రజల నమ్మకానికి చేసిన ద్రోహం.

నేహా సింగ్ రాథోడ్ అభిప్రాయాలతో ఎవరికైనా విభేదించే హక్కుంది. ఆమె విమర్శలను ఖండించే స్వేచ్ఛ కూడా ఉంది. కానీ ఆ విభేదాలకు సమాధానం వాదనలతోనే చెప్పాలి. మహిళను కించపరిచే పదజాలంతో కాదు. ప్రజాస్వామ్య ంలో విమర్శకు విమర్శ సమాధానం కావాలి; అవమానానికి అవమానం కాదు. ఒక మహిళను లైంగికంగా కించపరిచేలా చిత్రీకరించడం ద్వారా ఆమె వాదనను ఓడించామని భావించడం మేధో దివాళాకోరుతనం. అలాంటి పద్ధతులు ఒక్క నేహా సింగ్ రాథోడ్‌కే ముప్పు కావు. రేపు ప్రశ్నించాలనుకునే ప్రతి మహిళకు, ప్రతి జర్నలిస్టుకు, ప్రతి పౌరుడికి భయాన్ని కలిగించే ప్రమాదకర సంకేతం.

జర్నలిజం అంటే అధికారాన్ని ప్రశ్నించడం; అధికారాన్ని ప్రశ్నించేవారిని వేటాడటం కాదు. ప్రజల తరఫున నిలబడాల్సిన మీడియా, ప్రజల గొంతుకలనే నిందితుల బోనులో నిలబెడితే దాని నిష్పాక్షికత ఎక్కడ? ప్రజాహితం ఎక్కడ? వృత్తి ధర్మం ఎక్కడ? పాలకులపై విమర్శ వచ్చినప్పుడల్లా విమర్శకుల వ్యక్తిగత జీవితాలను తవ్వడం, వారి గౌరవాన్ని దెబ్బతీయడం, వారిని సమాజం ముందు చిన్నచూపు చూసేలా చేయడం, ఇవన్నీ జర్నలిజం పేరుతో సమర్థించలేని చర్యలు. ఒక వార్తా సంస్థకు అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం లేకపోవచ్చు; కానీ ప్రశ్నించేవారిని అవమానించే హక్కు మాత్రం లేదు.

ఇది కేవలం ఒక మహిళ గౌరవానికి సంబంధించిన అంశం కాదు. మహిళలపై లైంగిక అవమానకర వ్యాఖ్యలను సాధారణ వినోదంలా చూపించే సంస్కృతికి వ్యతిరేకంగా నిలబడాల్సిన సందర్భం. ఇలాంటి ప్రచారంపై వాస్తవాలు పరిశీలించాలి; ప్రసారమైన అసలు కంటెంట్‌ను ప్రజల ముందుంచి బాధ్యతను నిర్ధారించాలి. తప్పు జరిగిందని తేలితే సంబంధిత సంస్థ బహిరంగంగా వివరణ ఇవ్వాలి, బాధితురాలికి క్షమాపణ చెప్పాలి, తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. అవసరమైతే బాధితురాలు చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చు; సంబంధిత నియంత్రణ సంస్థలు కూడా తమ పరిధిలో పరిశీలించాలి. మీడియాకు భావప్రకటన స్వేచ్ఛ ఉన్నట్లే, ఆ స్వేచ్ఛను బాధ్యతతో వినియోగించాల్సిన కర్తవ్యం కూడా ఉంది.

ఒక చానల్ ఈ రోజు సంచలనం కోసం ఒక మహిళ గౌరవాన్ని పణంగా పెట్టవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన తర్వాత, అది చెప్పే నిజమైన వార్తకూ అనుమానమే ఎదురవుతుంది. వార్తా సంస్థల విశ్వసనీయత ప్రకటనలతోనో, అధికార పలుకుబడితోనో పెరగదు; నిజాయితీతో, ఆధారాల తో, బాధ్యతాయుతమైన సంపాదకీయ నిర్ణయాలతోనే పెరుగుతుంది. తప్పును సమర్థించుకోవడం సంస్థను కాపాడదు. తప్పును అంగీకరించి సరిదిద్దుకోవడమే దాని గౌరవాన్ని నిలబెడుతుంది.

ఏబీపీ న్యూస్ వ్యవహారంపై వస్తున్న విమర్శలకు సమాధానం మాటలతో కాదు, వాస్తవాలను స్పష్టం చేయడం ద్వారా, బాధ్యతను స్వీకరించడం ద్వారా, తప్పు జరిగితే క్షమాపణ చెప్పడం ద్వారా ఇవ్వాలి. జర్నలిజం ముసుగులో మహిళల గౌరవాన్ని కించపరిచే ధోరణికి ఎలాంటి సమర్థన ఉండకూడదు. లిలిప్రశ్నించే మహిళ శత్రువు కాదు. ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పలేని వ్యవస్థే ఆత్మపరిశీలన చేసుకోవాలి.

నేహా సింగ్ రాథోడ్‌కు మద్దతు ఇవ్వడం అంటే ఆమె ప్రతి అభిప్రాయంతో ఏకీభవించడం కాదు; ప్రశ్నించే హక్కును, మహిళ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను సమర్థించడం. ఈ రోజు ఆమెను అవమానించే ప్రయత్నాన్ని ప్రశ్నించకపోతే, రేపు ప్రశ్నించే ప్రతి గొంతుక ఒంటరిగా మిగిలిపోవచ్చు. ప్రశ్నను ఎదుర్కోండి,ప్రశ్నించిన మహిళను కాదు! వాదనతో సమాధానం చెప్పండి, బురదతో కాదు! మహిళల గౌరవాన్ని కాపాడండి, మీడియా విశ్వసనీయతను నిలబెట్టండి!

**స్టాండ్ విత్ నేహా సింగ్ రాథోడ్!**

*షేమ్ ఏబీపీ న్యూస్.. ఆరోపణలపై స్పష్టత ఇవ్వండి, తప్పు జరిగితే క్షమాపణ చెప్పండి!*

# పీపుల్స్ వాయిస్ — డియర్ సిజెపి నేతాఓ..ఏక్ బార్ మేరీ బాత్ సునో!

ప్రియమైన సిజెపి నేతలారా, ఒకసారి నామాట వినండి! కాక్రోచ్ జనతా పార్టీపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది! అక్రమ అరెస్టులు అక్రమ నిర్బంధాలు, లాఠీ చార్జీలు, జైలు శిక్షలు.. పోలీసుల వేషంలో రౌడీ మూకల దాడులు నిత్య కృత్యమయ్యాయి! అనునిత్యం భయోత్పాతం అమలవుతూ ఉంది! పిల్లలన్న జాలి లేదు, ఆడ మగా తేడా లేదు! ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రశ్నించిన వాళ్లందర్నీ పాశవికంగా అణిచివేస్తుంది ప్రభుత్వం! ఇదేమి ప్రజాస్వామ్యం? ఇదేమి పాలన?

అభిజిత్ దీప్కే ఆలోచించాలి! యువత ఉప్పొంగి వస్తోంది! ప్రజలందరి మద్దతూ ఉంది! అయినా ఈ అణిచివేత, అమానుషంగా ఎందుకు కొనసాగుతోంది అనీ.. లక్ష్యం సిద్ధించాలంటే, ఇంకా ఏం చేయవలసి ఉంటుంది అనీ.. ఏం నేర్చుకోవలసి ఉందీ అనీ ఆలోచించాలి! 'విద్యార్థి యువకులు వెల్లువలా కదలి వస్తున్నారంటే.. ఈ ప్రభుత్వ పాలనా వ్యవస్థలు ఎంతగా విఫలమయ్యాయో, అర్థం చేసుకుని ఆక్రోశించే చైతన్యం వాళ్ళలో ఉంది' అని అర్థం! ముఖ్యంగా జర్నలిస్టులు మీకు, అండదండగా ఉంటున్నారంటే, అంతకుమించిన నైతిక బలం మరేమి ఉంటుంది?

ఊరు వాడ, పల్లె పట్నం ఎక్కడ చూసినా.. ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక బుద్ధి జీవులు మీకు అండగా ఉంటున్నారు అంటే.. ఫాసిజాన్ని తలకెక్కించుకున్న ప్రభుత్వాల పాలన, కొంతైనా గాడిలో పడుతుందన్న ఆశ! ఓట్లు కోల్పోయిన ప్రజలకు న్యాయం చేయగలమనే ధీమా!



అందరి మద్దతు ఇంతగా అండగా ఉన్నప్పుడు, మరి ఎందుకు లక్ష్యం సాధించలేక పోతున్నారు? ఎందుకు అణచివేత హింసలతో ఉద్యమం అణచి వేయబడుతోంది? కారణాలను తెలుసుకోండి! పటిష్టమైన కార్యాచరణను రూపొందించుకోండి!

కోట్లాది ప్రజల ఓట్లను కొల్లగొట్టారంటేనే, అవి ప్రజాస్వామిక ప్రభుత్వాలు కావు! అవి ప్రశ్నను స్వీకరించలేవు! ఇవాళ అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి అయినా, రేపు ఇండియా కూటమి వచ్చినా, అవి ప్రజల కోసం ఆలోచించలేవు! ప్రశ్నించే శక్తులను పాశవికంగా అణిచివేయడానికి, ఎంతటి క్రూర నిర్బంధాన్నైనా అమలు చేయడానికి వెనకాడవు! ఇది చరిత్ర!

అందుకే సమాజ మార్పు, సమిష్టి కార్యాచరణతో ఉండాలి! మీ వెంట ఎంత మంది యువత కదిలొచ్చినా, ఇప్పుడు మీరు ఉద్యమాలు చేయాల్సింది, మీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో కాదు! కలిసొచ్చే అన్ని రాజకీయ పార్టీలతో.. కలిసొచ్చే అన్ని సామాజిక సంఘాలతో.. కలిసొచ్చే అన్ని సామాజిక అభ్యుదయ శక్తులతో! వీళ్లందరితో 'విశాల ఐక్య పోరాట వేదికను' నిర్మించండి! నిర్మాణాలు లేకుండా, ఏ సామాజిక ఉద్యమాలు విజయం సాధించలేవు! మీ లక్ష్యం మంచిదే అయినా, నిర్మాణాలు లేకపోవడం వల్లే, మీరు చేస్తున్న తప్పిదాలను మీరు సమీక్షించుకోలేక పోతున్నారు! ఇప్పటికే ఒక్కొక్కరూ ఒక్కో రకంగా నోరు జారుతూ, అవకాశవాదులకు ఊతమిస్తున్నారు! అందుకే నిర్మాణాత్మకమైన పని విధానం ఉండాలి! అరవై ఏళ్ల ప్రజల ఆకాంక్ష అయిన 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని' మేము.. ఏ ఒక్క పార్టీతో కాకుండా, అందరమూ ఏకమయ్యి, జాయింట్ యాక్షన్ కమిటీ – జాక్ పేరుతో ప్రభుత్వాల మెడలు వంచాము! రాష్ట్రాన్ని సాధించుకున్నాము!

అందుకే చరిత్రను అధ్యయనం చేయండి! గుణపాఠాలు నేర్చుకోండి! సమిష్టి కృషితోనే, ఐక్య పోరాటాలతోనే ముందుకు సాగుదాం! పాలకుల కళ్ళు తెరిపిద్దాం! లక్ష్యాన్ని సాధిద్దాం!



- ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284

# నూతన ఆవిష్కరణలకు స్వాగతం




*కొత్త ఆవిష్కరణల పట్ల నకారాత్మక ధోరణి (వెనక చూపు): చారిత్రక నిరోధకత నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) యుగం వరకు ఒక విశ్లేషణ*

మానవ నాగరికత ప్రస్థానంలో ప్రతి నూతన సాంకేతిక ఆవిష్కరణ సమాజంలో భయాందోళనలను, నిరోధకతను ఎదుర్కొంది. ఈ పరిశోధనా పత్రం 'ముందు చూపు' (Foresight) కు బదులుగా 'వెనక చూపు' (Hindsight) చూసే నకారాత్మక శక్తుల ధోరణిని చారిత్రక కోణంలో విశ్లేషిస్తుంది. కెమెరా, రైలు, విద్యుత్, కంప్యూటర్ల నుండి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వరకు జరిగిన వ్యతిరేక ప్రచారాలను చర్చిస్తూనే... నూతన సాంకేతికత అనేది సమాజంలోని మార్జినల్ (వెనుకబడిన) ప్రజలకు లీప్‌ఫ్రాగ్ (రాముజూటతీశ్రీ) అయ్యే అద్భుతమైన అడ్వాన్స్ థింకింగ్ అవకాశాన్ని ఎలా కల్పిస్తుందో ఈ పత్రం నిరూపిస్తుంది. టాటా, రిలయన్స్ వంటి సాంప్రదాయ పారిశ్రామిక దిగ్గజాల కంటే కొత్తవారే ఐటీ విప్లవాన్ని ఎలా ముందుగా అందుకున్నారో చారిత్రక ఆధారాలతో విశ్లేషించడం ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

మానవ నాగరికత పరిణామ క్రమంలో మార్పు అనేది నిరంతరం జరిగే ఒక సహజ ప్రక్రియ. ప్రతి నూతన ఆవిష్కరణ, సాంకేతిక విప్లవం మానవ జీవన ప్రమాణాలను, సామాజిక సమానత్వాన్ని మెరుగుపరచడానికే ఉద్భవించాయి. అయితే, చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఏ కొత్త ఆవిష్కరణ అయినా సమాజంలోకి ప్రవేశించినప్పుడు దానికి స్వాగతం లభించడం కంటే, వ్యతిరేకతే ఎక్కువగా ఎదురైంది. సమాజంలో ఒక వర్గం ఎప్పుడూ 'ముందు చూపు'తో భవిష్యత్తు అవకాశాలను చూస్తుంది. మరొక వర్గం , 'వెనక చూపు'తో పాత పద్ధతులకు అతుక్కుపోవడానికి ప్రయత్నిస్తుంది.

కొత్తదనం తెచ్చే విప్లవాత్మక లాభాలను అధ్యయనం చేయడం ముందు చూపు గల వారు చేస్తారు. మరికొందరు న్నారు., కేవలం అందులోని నష్టాలను, తాత్కాలిక కష్టాలను (మాత్రమే)భూతద్దంలో చూపిస్తూ సమాజంలో ఒక విధమైన భయాందోళనలను సృష్టిస్తారు. ఈ నకారాత్మక (చీవస్త్రుఫ్అజవ) ప్రచారాలను, వాటి వెనుక ఉన్న వాస్తవాలను సమగ్రంగా విశ్లేషించడం ఈ వ్యాసం పరిధి.

### ప్రాథమిక ఆవిష్కరణలు

మానవుడు తన శ్రమను తగ్గించుకోవడానికి, వేగాన్ని పెంచుకోవడానికి చేసిన ప్రాథమిక ప్రయత్నాలను కూడా అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. రవాణా సాధనాలు – ప్రమాదాల భయం: మనిషి నడక నుండి చక్రం వైపు, ఆపై సైకిల్, బైక్, కార్ల వైపు అడుగులు వేస్తున్నప్పుడు భద్రత పేరుతో పెద్ద ఎత్తున భయపెట్టారు. "సైకిల్ తొక్కితే కింద పడి కాళ్లు, చేతులు విరుగుతాయి", "బైక్ నడిపితే యాక్సిడెంట్ అవుతుంది" అని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారనేది నిజమే అయినప్పటికీ, ఆ ప్రమాదాలకు కారణం సాంకేతికత కాదు, మానవ తప్పిదాలు లేదా ట్రాఫిక్ నియంత్రణ లోపం.

### రైల్వేలు, విమానయానం:

రైల్వే ఇంజన్ కనుగొన్న కొత్తలో, ఆ పొగ వల్ల పశువులు పాలు ఇవ్వవని, పంటలు పండవని ప్రచారం చేశారు. ఇక విమానయానం గురించి అయితే, "ఆకాశం నుండి విమానం సముద్రంలో పడిపోతే ఒక్క ప్రాణం కూడా మిగలదు" అంటూ అత్యంత భీతావహమైన నెగెటివిటీని వ్యాప్తి చేశారు. కానీ నేడు విమానయాన రంగం ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చింది. భయం చూపే మార్గాన్ని ఎంచుకుంటే మానవాళి ఇప్పటికీ ఎడ్ల బండ్ల యుగంలోనే ఉండిపోయేది. ఆధునిక ఆవిష్కరణలను అందుకోలేని, దేశాలు, జాతులు, వర్గాలు, కులాలు, ఆదివాసీ దశలోనే వుండి పోతారు. మా సంస్కృతి, మా కులవృత్తి అంటూ అక్కడే ఆగిపోయేవారు అ వెనుక బడిన దశలోనే జీవిస్తారు. సనాతన ధర్మం అనిఇతరులకు బోధించేవారు తాము అన్ని అవకాశాలు, అధికారాలు అందుకుని ఇతరులు ఎదగకుండా, పోటీ రాకుండా ఉండేందుకు సనాతన ధర్మం అని చెప్తారు. వారు కరెంటు, కారు, విమానాలు, ఇంటర్నెట్, ఐఏఎస్, మంత్రి ముఖ్య మంత్రి, ప్రధాని వంటి వన్నీ చేజిక్కించుకున్న వారే! నిజంగా వారు చెప్పిందే ఆచరిస్తే వారు, ఆదివాసీలుగా జీవనం సాగిస్తారు.

నేడు మానవ ఆలోచనా పరిధి విమానాల నుండి అంతరిక్ష నౌకల వైపు సాగినప్పుడు, సమాజంలో వ్యతిరేకత మరియు అనుమానాలు అంతరిక్ష స్థాయికి చేరాయి. భారతదేశం ఇస్రో (ISRO) ఆధ్వర్యంలో తన అంతరిక్ష ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు, కొందరు వెనక చూపు చూసే విమర్శకులు తీవ్రంగా పరిహసించారు. "వీధుల్లో పేదరికం ఉంటే, రాకెట్ల కోసం ప్రజా ధనాన్ని వృథా చేయడం ఎందుకు?" అని ప్రశ్నించారు. చంద్రుడిని, నక్షత్రాలను తాకడానికి ప్రయత్నిస్తే అది గ్రహచార దోషాలకు లేదా దేశ సంపద నాశనానికి దారితీస్తుందని భయపెట్టారు.

కానీ నేడు, భారతదేశం ప్రపంచంలోనే తిరుగులేని 'అంతరిక్ష శక్తి' (Global Space Power)గా నిలిచింది. చంద్రయాన్, మంగళయాన్ వంటి అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన మిషన్లను విజయవంతంగా పూర్తి చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఈ అంతరిక్ష సార్వభౌమత్వం దేశాన్ని పేదరికంలోకి నెట్టలేదు; దానికి భిన్నంగా దేశీయ టెలికమ్యూనికేషన్ రంగంలో విప్లవం తెచ్చింది, తుఫానులను ముందుగానే అంచనా వేసి లక్షలాది మంది రైతుల, మత్స్యకారుల ప్రాణాలను కాపాడింది. అంతేకాకుండా, లక్షలాది మంది యువతకు ఉన్నత స్థాయి సాంకేతిక ఉపాధిని కల్పించే స్వదేశీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పరిశ్రమను సృష్టించింది.

కెమెరా ఆవిష్కరణ – ఆయుష్షు మూఢనమ్మకం: సాంకేతికత పట్ల అజ్ఞానం ఎంతటి భయాందోళనలకు దారితీస్తుందో చెప్పడానికి కెమెరా ఆవిష్కరణ ఒక పెద్ద ఉదాహరణ. తొలినాళ్లలో కెమెరా వచ్చాక, "ఫోటో దిగితే అందులో మనిషి నీడ లేదా ఆత్మ బందీ అయిపోతుందని, దానివల్ల మనిషి ఆయుష్షు తగ్గిపోతుందని" నమ్మేవారు. సమాజంలో కొందరు ఈ మూఢనమ్మకాన్ని తీవ్రంగా ప్రచారం చేశారు. కానీ నేడు అదే కెమెరా ప్రపంచాన్ని రికార్డు చేస్తోంది, ఎందరో మహానుభావుల స్మృతులను సజీవంగా ఉంచుతోంది.

### సంస్కర్తలు చేయలేని పని చేసిన బస్సులు, రైళ్లు చేసాయి:

భారతదేశంలో వేల సంవత్సరాలుగా పేరుకుపోయిన కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక జాడ్యాలను తొలగించడానికి ఎందరో సంఘ సంస్కర్తలు జీవితాంతం కృషి చేశారు. వారు సైద్ధాంతికంగా ఎంతో పోరాటం చేసినప్పటికీ సమాజంలో ఆశించిన వేగంతో మార్పు రాలేదు. కానీ బస్సులు, రైళ్లు వంటి రవాణా ఆవిష్కరణలు సంస్కర్తలు చేయలేని అద్భుతాన్ని క్షేత్రస్థాయిలో చేసి చూపించాయి.

అంటరానితనంపై దెబ్బ: రైలు కనుగొన్న కొత్తలో, "ఇందులో అందరూ కలిసి కూర్చుంటే కులాలు భ్రష్టుపడతాయి" అని కొందరు సంప్రదాయవాదులు ప్రచారం చేశారు. కానీ జీవన గమనం కోసం, ప్రయాణ అవసరాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అందరూ ఒకే భోగీలో, ఒకే సీటుపై పక్కపక్కనే కూర్చోవలసి వచ్చింది.

సామాజిక ఐక్యత: రైలు ప్రయాణం ఏ కుల మతాలకతీతంగానైనా అందరినీ ఒకేలా ప్రయాణింపజేసింది. ఒకరినొకరు తాకకుండా ప్రయాణించడం అసాధ్యంగా మారింది. ఆ విధంగా వేల ఏళ్ల నాటి అంటరానితనం మరియు సామాజిక దూరాన్ని ఈ రవాణా విప్లవం చాలా సహజంగా తొలగించింది. నేడు భారతదేశంలో కేవలం భారతీయ రైల్వే రంగంలోనే దాదాపు 12 లక్షల మందికి పైగా ఉద్యోగులు నేరుగా జీవనోపాధి పొందుతున్నారు. పరోక్షంగా కోట్లాది మందికి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచింది.

### విద్యుత్, ముద్రణ మరియు సమాచార విప్లవం

మానవ మేధస్సును, సమాచారాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో విద్యుత్, ప్రింటింగ్ ప్రెస్ మరియు మీడియా రంగాలు కీలక పాత్ర పోషించాయి.

**విద్యుత్ ఆవిష్కరణ:** కరెంటు కనుగొన్నప్పుడు, "దానివల్ల షాక్ కొట్టి మనుషులు చచ్చిపోతారు" అని ప్రచారం చేస్తూ ఇళ్లలోకి కరెంటు కనెక్షన్లు తీసుకోవడానికి ప్రజలు భయపడేలా చేశారు. కానీ వాస్తవానికి కరెంట్ రాక వల్ల కోట్లాది మందికి నూతన ఉపాధి, సరికొత్త పరిశ్రమలు, రాత్రి వేళల్లోనూ పని చేసుకునే వెసులుబాటు కలిగాయి. నూతన ఉత్పత్తుల తయారీ పెరిగి ప్రపంచ గతి మారిపోయింది.

**ప్రింటింగ్ ప్రెస్ (Printing Press):** ముద్రణ యంత్రం రాకముందు జ్ఞానం అనేది కేవలం కొద్దిమంది కులాలకు,వర్గాలకే పరిమితమై ఉండేది. ప్రింటింగ్ ప్రెస్ వచ్చిన కొత్తలో, "దీనివల్ల అనవసర సమాచారం ప్రచారమై సమాజం పాడైపోతుంది" అని కొందరు మేధావులు వాదించారు. కానీ ప్రింటింగ్ ప్రెస్ వల్లనే జ్ఞానం, విజ్ఞానం, పుస్తకాలు సామాన్యుడికి సైతం అందుబాటులోకి వచ్చాయి. పత్రికల రాకతో సమాజంలో ప్రతి ఒక్కరికీ సమానంగా సమాచారం, వార్తలు అందుతూ ప్రజాస్వామ్యం బలోపేతమైంది.

సినిమా, రేడియో, టీవీల ప్రభావం: వినోద మరియు సమాచార సాధనాలైన సినిమా, రేడియో, టీవీలు వచ్చినప్పుడు "ఇవి యువతను పక్కదారి పట్టిస్తాయి", "సమయాన్ని వృథా చేస్తాయి" అని భయపెట్టారు. కానీ ఈ మాధ్యమాల వల్ల ఎందరో ప్రతిభావంతులైన కళాకారులు, సాంకేతిక నిపుణులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. లక్షలాది కుటుంబాలకు ఇది ఒక పెద్ద పరిశ్రమగా మారి ఉపాధిని ఇచ్చింది.

### పారిశ్రామిక విప్లవం, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ

శారీరక శ్రమను యంత్రాలు భర్తీ చేయడం ప్రారంభించినప్పుడు, అది ఉపాధిని పూర్తిగ్గా తుడిచిపెట్టేస్తుందనే ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. ట్రాక్టర్లు – వ్యవసాయ కూలీల ఆందోళన: వ్యవసాయ రంగంలోకి ట్రాక్టర్లు, హార్వెస్టర్లు (కోత మిషన్లు) వచ్చినప్పుడు, "ట్రాక్టర్ల వల్ల వ్యవసాయ కూలీలకు పనులు పోయి ఆకలి చావులు వస్తాయి" అని ప్రచారం చేశారు. కానీ వాస్తవానికి యాంత్రీకరణ వల్ల వ్యవసాయం లో ఉత్పాదకత పెరిగింది. సమయం ఆదా అయింది. కూలీలు మరింత నైపుణ్యం కలిగిన ఇతర పనుల వైపు మళ్లడానికి ఇది దోహదపడింది.

**యంత్రాలు- కుల వృత్తుల అంతర్ధానం:** ఆధునిక యంత్రాల రాకతో సాంప్రదాయ కుల వృత్తులు దెబ్బతిన్నాయనే వాదన విస్తృతంగా వినిపించింది. అయితే, మారుతున్న కాలంతో పాటు వృత్తులు కూడా ఆధునీకరణ చెందాలనే 'ముందు చూపు'ను ఈ ప్రచారకులు విస్మరించారు. యంత్రాలు కష్టమైన శ్రమను తగ్గించి, నాణ్యమైన వస్తువులను తక్కువధరకు సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చాయనే వాస్తవాన్ని వీరు కప్పిపుచ్చారు. కువృత్తులకు పరిమితమైనవారు పేదలుగానే మిగిలి పోతున్నారు. ఆధునిక విద్య విజ్ఞానం, ఉపాధి అందుకునే వారే ఎదుగుతున్నారు.

### గ్లోబలైజేషన్ మరియు కంప్యూటర్ విప్లవం: ఒక చారిత్రక సత్యం

1980, 90ల కాలంలో భారతదేశంలో కంప్యూటర్ల ప్రవేశాన్ని మరియు గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి.

వద్దన్న కంప్యూటర్లు – నేటి ఐటీ ఉద్యోగాలు: "ఒక కంప్యూటర్ వస్తే పది మంది మనుషుల ఉద్యోగాలు ఊడిపోతాయి" అని నాడు నినాదాలు చేశారు. కంప్యూటర్లను వద్దంటూ ఆఫీసుల ముందు ధర్నాలు చేశారు. కానీ కాలం ఏం నిరూపించింది? ఇవాళ సాంప్రదాయ ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ఎన్నో వందల రెట్లు ఎక్కువ సంఖ్యలో సాఫ్ట్‌వేర్ మరియు ఐటీ రంగ ఉద్యోగాలు పెరిగాయి. కంప్యూటర్ విప్లవంకారణంగా భారతదేశం ప్రపంచ ఐటీహబ్‌గా మారింది.

**ప్రపంచీకరణలో ద్వంద్వ నీతి:** "గ్లోబలైజేషన్ వస్తే బహుళజాతి సంస్థలు మన దేశాన్ని దోచుకుంటాయి" అంటూ భయపెట్టిన వారే, ఆ తరువాత కాలంలో అందరికంటే ముందుగా ఆ బహుళజాతి సంస్థలు కల్పించిన కార్పొరేట్ ఉద్యోగాల అవకాశాలను, ఆర్థిక ప్రయోజనాలను అందుపుచ్చుకున్నారు.

కొత్త ఆవిష్కరణల పట్ల వ్యక్తమయ్యే ఈ వ్యతిరేకత కేవలం యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగానికే పరిమితం కాలేదు, అది జీవశాస్త్రాలలోకి కూడా విస్తరించింది. వైద్యరంగంలో బయోటెక్నాలజీ ప్రవేశించినప్పుడు ఎదురైన వ్యతిరేకతే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. రీకాంబినెంట్ ఐచీూ టెక్నాలజీ, జెనెటిక్ ఇంజనీరింగ్, స్టెమ్ సెల్ థెరపీ, మరియు వ్యాక్సిన్లు వంటి విప్లవాత్మక ఆవిష్కరణలు వచ్చినప్పుడు, భయాందోళనలు సృష్టించేవారు దీనిని "ప్రకృతి నియమాలకు విరుద్ధం" అని ప్రచారం చేశారు. ల్యాబ్‌లలో జన్యుమార్పిడి ద్వారా తయారుచేసే మందులు మనుషులను వికలాంగులుగా మారుస్తాయని, కొత్త రోగాలకు దారితీస్తాయని, మానవ ఉనికికే ప్రమాదకరమని సోషల్ మీడియాలో, సమాజంలో పెద్ద ఎత్తున భయపెట్టారు. ఇన్సులిన్ ఉత్పత్తి నుండి నేటి 'క్రిస్పర్' జన్యు సవరణ సాధనాల వరకు ప్రతి వైద్య మైలురాయి ప్రారంభంలో ఇలాంటి నిందలనే ఎదుర్కొంది.

కానీ వాస్తవానికి బయోటెక్నాలజీ వైద్యరంగాన్ని సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చి కోట్లాది మంది ప్రాణాలను కాపాడింది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు గతంలో ప్రాణాంతక మహమ్మారులకు, దీర్ఘకాలిక వ్యాధులకు బలయ్యేవారు. బయోటెక్నాలజీ వల్ల వ్యాక్సిన్లు, బయో-ఇంజనీర్డ్ మందులు భారీగా ఉత్పత్తి అయి, చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గాయి. ఇది మానవుడి సగటు ఆయుష్షును పెంచింది. మూఢనమ్మకాల భయాన్ని పక్కనబెట్టి శాస్త్రీయ దృక్పథాన్ని ఎంచుకోవడం వల్లే వైద్యం నేడు కొద్దిమంది సంపన్నుల లగ్జరీగా కాకుండా, సామాన్యుడి హక్కుగా మారింది.

### డిజిటల్ విప్లవం: పెయింటింగ్ ఆర్టిస్టుల నుండి కంప్యూటర్ డిజైనర్ల వరకు:

సృజనాత్మక రంగంలో సాంకేతికత ప్రవేశించిన ప్రతిసారీ కళాకారుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే ప్రచారం నిరంతరం జరుగుతూనే ఉంది. కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ డిజైన్స్: కంప్యూటర్ గ్రాఫిక్స్, ఫొటోషాప్, డిజిటల్ కంపోజింగ్ మరియు ఫ్లెక్స్ ప్రింటింగ్ టెక్నాలజీ రాగానే, "వేలాది మంది పెయింటింగ్ ఆర్టిస్టుల పొట్ట కొడుతున్నారు" అని నెగెటివ్ ప్రచారం చేశారు.

**కళాకారుల పరిణామం:** చేతో గీసే పెయింటర్లు కొందరు సాంప్రదాయ పని కోల్పోయిన మాట నిజమే అయినప్పటికీ, ఆ సాంకేతికతను నేర్చుకున్న ఆర్టిస్టులు నేడు డిజిటల్ డిజైనర్లుగా, యానిమేటర్లను, UI/UX డిజైనర్లుగా మారి వందల రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నారు. టెక్నాలజీ కళను చంపలేదు, కళ యొక్క పరిధిని మరియు ఉపాధి అవకాశాలను విస్తరించింది.

నూతన సాంకేతికత – మార్జినల్ ప్రజల 'లీప్‌ఫ్రాగ్' విప్లవం (కొత్త విభాగం) సాంకేతిక పరిణామాలలో అత్యంత విప్లవాత్మకమైన మరియు సామాజిక న్యాయాన్ని చేకూర్చే ఒక చారిత్రక కోణాన్ని మనం ఇక్కడ ప్రత్యేకంగా గమనించాలి. నూతన సాంకేతికత అనేది సమాజంలోని మార్జినల్ (వెనుకబడిన/చివరి వరుసలో ఉన్న) ప్రజలకు ఒక 'సమాన అవకాశాల వేదిక'ను కల్పిస్తుంది.

అందరికీ ఒకేసారి కొత్త: ఏదైనా ఒక సరికొత్త టెక్నాలజీ లేదా ఆవిష్కరణ మార్కెట్లోకి వచ్చినప్పుడు, అది కోటీశ్వరుడికైనా, సామాన్యుడికైనా ఒకేసారి కొత్తగా పరిచయం అవుతుంది. అందులో ఎవరికీ ముందస్తు అనుభవం ఉండదు. ఈ తరుణంలో, సాంప్రదాయక శక్తులు తమ పాత వైభవంలో మునిగి తేలుతూ "వెనక చూపు" చూస్తున్నప్పుడు... సమాజంలో వెనుకబడిన లేదా కొత్త తరం యువత అడ్వాన్స్ థింకింగ్ తో ఆ సరికొత్త మార్పును అందరికంటే వేగంగా అందుకొని ముందుకు దూసుకుపోతారు. దీనినే ఆర్థిక-సామాజిక శాస్త్రంలో 'లీప్‌ఫ్రాగింగ్' (Leapfrogging – ఒకేసారి కొన్ని దశలను దాటి అందరికంటే ముందుకు వెళ్లడం) అంటారు. ఇలా వేల ఏళ్ల వెనుక బాటు నుండి గిరిజనులను ఒకే తరం లో ప్రపంచంతో పోటీపడే వారు గా ఆధునిక ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో మార్చవచ్చు . వారిని ఎదిరించడానికి ఏ విప్లవాలు అక్కర్లేదు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

మిగితా తరువాయి సంచికలో..

## కుషాయిగూడలో 'ధీరవ్' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



**కాప్రా, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** కాప్రా సర్కిల్ కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి'ని ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవివర్మ, మేనేజింగ్ డైరెక్టర్లు దీప్తి సంగరాజు, ఎం. సుమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు ఆసుపత్రి రిబ్బన్ కట్ చేసి, వైద్య శాలలోని వివిధ విభాగాలను పరిశీలించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు తక్కువ ఖర్చుతో, అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ఆసుపత్రి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ధన్ పాల్ రెడ్డి, సీతారాం రెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి గౌడ్, మహమ్మద్ గౌస్ స్థానిక ప్రముఖులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పండుగ బతుకమ్మ

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఆక్టోబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పండుగ బతుకమ్మ. పండగ అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని సాయిపూర్ లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పండుగ బతుకమ్మ. మహిళలు ఇలా కలిసికట్టుగా పండుగను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. అనంతరం మహిళలు వేసిన బతుకమ్మల చుట్టూ ఎమ్మెల్యే గారు మహిళలతో కలిసి ఆడిపాడారు. మహిళల ఉత్సాహం, ఆనందం మధ్య వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రహదారి పనుల్లో నాణ్యతే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



**శంకర్‌పల్లి, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** వికారాబాద్ రోడ్డు నుంచి రావులపల్లి కలాన్ గ్రామం వరకు చేపడుతున్న తారు రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం శంకర్‌పల్లి సహకార సంఘం అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డితో కలిసి ఆయన రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నాసిరకంగా పనులు చేపడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి కలాన్ సర్పంచ్ సువర్ణ కృష్ణమూర్తి, వార్డు సభ్యులు సుప్రజా శ్రీకాంత్ రెడ్డి, మీనా మల్లేష్, ఉత్తరపల్లి ప్రభాకర్, పట్నం శ్రీనివాస్, గద్య సురేష్, అంజద్, సునీత, సద్దాం, నాయకులు వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



**షాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో ప్రతిష్టించబడిన దుర్గామాత ను ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ...దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలి

- ప్రజలు జీవించే హక్కును కాపాడాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా జేఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరహార దీక్షలకు మద్దతుగా అరుణోదయ విమలక్క నేతృత్వంలో బహుజన బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 15వ రోజు జరుగుతున్న రిలే నిరహార దీక్షలకు విమలక్క మద్దతు తెలిపి, అక్కడే మహిళలతో బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆటా పాటలతో బతుకమ్మా బతుకనీయమ్మా, సేవ్ సిద్దాపూర్ అంటూ ఉద్యమానికి మరింత ఊపునించారు.. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జేఏసి చైర్మన్ రాంబాల్ నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ... ప్రజల యొక్క అభిప్రాయాలు తీసుకోకుండా ఏక పక్షంగా రాష్ట్ర ప్రభుత్వం సిద్దాపూర్ లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయం తీసుకుని జీవో 641 తీసుకు రావడం దారుణమన్నారు.. ఫ్యూచర్ సిటీకి అతి చేరువలో ఈ డంపింగ్ యార్డు పెట్టడం అంటే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటి అని ప్రశ్నించారు. ప్రజలు పార్టీలకు అతీతంగా కదలాల్సిన అవసరం ఉందని, ఈ ఉద్యమానికి తాను సంపూర్ణ మద్దతు తెలుపుతూ, డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఈ విషయంలో గవర్నర్ కు కూడ వినతి పత్రం ఇస్తామన్నారు.

### పార్టీలకతీతకంగా పోరాడుదాం

పార్టీలకు అతీతంగా అందరం కలిసి డంపింగ్ యార్డు రద్దు కొరకు పోరాడుదామని మాజి ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ తెలిపారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కొరకు అందరూ పార్టీలకు అతీతంగా జేఏసి ఆధ్వర్యంలో పోరాటం చేయాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీగా జేఏసి ఎలాంటి కార్యక్రమం ఇచ్చినా పాల్గొని విజయవంతం చేస్తామన్నారు.. ఈ పోరాటానికి మద్దతు తెలపటానికి వచ్చిన విమలక్కకు ధన్యవాదాలు తెలిపారు.

### జీవన విధానానికి నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలి

సిద్ధాపూర్ గ్రామ ప్రజల జీవన విధానానికి, భవిష్యత్ తరాలకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని ఆయన కోరారు. సిద్ధాపూర్ గ్రామ పరిరక్షణ కోసం ప్రజలు చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆర్టీ నంబర్ 641ను రద్దు చేసి సిద్ధాపూర్ గ్రామాన్ని పరిరక్షించాలని, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ ఆర్టీ నంబర్ 641ను తొలగిస్తేనే సిద్ధాపూర్ ప్రజలు సంతోషంగా బతుకమ్మ పండుగ జరుపుకోగలరని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

### ఈ డంపింగ్ యార్డు రద్దు కొరకు ప్రజలతో కలసి పోరాటం చేస్తాం

కాంగ్రెస్ పార్టీలో మండల అధ్యక్షునిగా ఉన్నపటికీ డంపింగ్ యార్డు రద్దు కొరకు ప్రజల పక్షాన ఎల్లప్పుడూ పోరాటం చేస్తానని, గతంలో పార్టీ అధిష్టానం నుంచి నోటీస్ లు అందుకున్నానని, అయినా ప్రజల కోసం స్థానిక శాసన సభ్యులు శంకర్ పై అన్ని విధాల వత్తిడి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కుడా సానుకూలంగా ఉన్నారని డంపింగ్ యార్డు రానివనని చెప్పారన్నారు. ఒకవేళ పార్టీ గా ప్రజలకు అన్యాయం జరిగితే




పార్టీనీ వదలటానికి వెనకాడనన్నారు.

### జీవో రద్దయ్యే వరకు ఉద్యమం ఆగదు..

ప్రజలకు కావాల్సింది హామీలు కాదని, జీవో రద్దుకావడమే ముఖ్యం అని, జీవో రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని పినపాక ప్రభాకర్, జేఏసీ కన్వీనర్. అన్నారు. స్థానిక శాసన సభ్యులు దీనిని వ్యతిరేకించటం అసెంబ్లీలో మాట్లాడటం మంచి పరిణామమే కానీ ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చి జీవో రద్దు కొరకు ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి , సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో ఆర్డినేటర్లు తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, కో చైర్మన్లు సత్యనారాయణ , శ్రీనివాస రెడ్డి, బాలయ్య, రజిత, మహేష్, కో కన్వీనర్లు ఈశ్వర్ నాయక్ , శ్రీకాంత్, రవీంద్రనాథ్, అర్జునప్ప, సిద్దాపూర్ గ్రామ కమిటీ సభ్యులు రాజేందర్ రెడ్డి, శ్రీధరా చారి, నగేష్ నాయక్, మహేష్, నరేందర్ రెడ్డి, వంకాయల నారాయణ రెడ్డి, ఈటా గణేష్, దేవేందర్ యాదవ్, మెండే కృష్ణ, విఠల్, కళ్ళెం నరసింహా రెడ్డి, శ్రీలత సత్యం మరియు వివిధ గ్రామాల సర్పంచులు మరియు మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మీయతకు ప్రకృతి ప్రేమకు ప్రతీక బతుకమ్మ

**వికారాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వికారాబాద్ డిపో ప్రాంగణంలో ఆదివారం నాడు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ నమ్రత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆర్టీసీకి చెందిన మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని డిపో ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో, అందమైన ముగ్గులతో సుందరంగా అలంకరించారు. మహిళా ఉద్యోగులు వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ జానపద పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ నమ్రత మాట్లాడుతూ, తెలంగాణ



ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆర్టీసీ కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వేడుకలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు, సిబ్బందికి, ప్రయాణికులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టు నీటి విడుదలను పరిశీలించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**సిర్గాపూర్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటి కాలువలకు నీటి విడుదలను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా తీరును పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు నీరు అందుతున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ.. నల్లవాగు ప్రాజెక్టు నీరు చివరి ఆయకట్టు వరకు ఉన్న ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు స్వయంగా కాలువల వెంట పర్యటిస్తూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, మధ్యలో ఎవరూ అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని మళ్లించకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న రైతులు తమ పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించుకోవాలని, మిగిలిన నీటిని కాలువల ద్వారా ముందున్న గ్రామాలకు, చివరి ఆయకట్టులోని రైతులకు చేరేలా సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సాగునీరు కొందరికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల రైతులకు సమానంగా అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు.

## సొంత నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

- దినకర్ సేవకు ప్రశంసలు
- గ్రామ అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయం

**కోహీర్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పిచరగాడి గ్రామంలో పంగాల దినకర్ తన సొంత నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించడం అభినందనీయమని రామావత్ సాయినాథ్ పేర్కొన్నారు. దసరా పండుగ శుభ సందర్భంగా గ్రామంలోని దుర్గామాత ఆలయం సమీపంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధి పట్ల పంగాల దినకర్‌కు ఉన్న నిబద్ధత, సామాజిక బాధ్యతాభావం ఇతరులకు స్ఫూర్తిదాయకమని సాయినాథ్ కొనియాడారు.



ప్రభుత్వ సహకారంతో పాటు గ్రామంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు తమ వంతు సహకారం అందిస్తే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. సొంత నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టే దాతలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పిచరగాడి గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించిన పంగాల దినకర్‌ను పలువురు అభినందించారు.

## ప్రతి పల్లె అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యం

- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి
- గ్రామాలలోని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**మహమ్మదాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మదాబాద్ మండలంలోని, వెంకట్‌రెడ్డిపల్లి,మంగంపేట,మంగంపేట తండాల్లో సీసీ రోడ్లు,తాగునీటి బోర్లు,అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర నాయకుడు, డాక్టర్ వెన్న ఈశ్వరప్ప,బీజేపీ జిల్లా అధ్యక్షుడు యు.రమేష్,మండల అధ్యక్షుడు మూస నరసింహులు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈకార్యక్రమంలో గండేడ్ మండల బిజెపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,శంకర్ నాయక్,గిరముని శ్రీనివాసులు,ఏవీ రాములు,మిట్ట పరమేశ్వర్ రెడ్డి,జిల్లా నాయకుడు కురువ కృష్ణ,వెంకట్ రెడ్డిపల్లి,సర్పంచ్ కుమ్మరి రామకృష్ణ,ముందలి తండా సర్పంచ్ రాకేష్,కుడుముల రాజు,ముచల సురేష్,చౌదరి శ్రీనివాసులు,బిజెపి నాయకులు కార్యకర్తలు,మాజీ



సర్పంచ్ రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభలు

- లోగో ఆవిష్కరించిన జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం నేతలు

**ముషీరాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ జాతీయ మహాసభలు నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం నాయకులు తెలిపారు. ఈ మహాసభల లోగోను ఆహ్వాన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ఆవిష్కరించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యులున్న ఎఐకెఎస్ రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. మహాసభల ప్రారంభం సందర్భంగా




నవంబర్ 15న నల్లగొండలో లక్ష మందితో భారీ రైతు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 850 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీ నెరవేరలేదని, వ్యవసాయ సంక్షోభానికి కార్పొరేట్ అనుకూల విధానాలు, అసమాన మార్కెట్ వ్యవస్థ ప్రధాన కారణాలని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం, గ్రామీణ పేదలకు ఉపాధి, భూమిలేని వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, నంద్యాల నర్సింహారెడ్డి, పి. జంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాదినేని రమేష్, కందాల ప్రమీల, మల్లు నాగార్జునరెడ్డి, సహాయ కార్యదర్శులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 19 అక్టోబర్ 2026

# కిష్టాపూర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

- పేరూరు గ్రామానికి లింక్ రోడ్డు నిర్మించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన ఆవుల రాజిరెడ్డి
- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్



**కొల్చారం, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కిష్టాపూర్ ప్రధాన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు పేరూరు గ్రామానికి వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం కిష్టాపూర్ గ్రామానికి వచ్చిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

### పదేళ్లుగా రహదారి సమస్య

కిష్టాపూర్ ప్రధాన రహదారి గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మల్లేశం గౌడ్ వివరించారు. గ్రామానికి చేరుకోవడానికి ప్రధాన మార్గమైన ఈ రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కిష్టాపూర్ ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు కిష్టాపూర్ నుంచి పేరూరు గ్రామానికి వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను సైతం ఆవుల రాజిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

### సానుకూలంగా స్పందించిన ఆవుల రాజిరెడ్డి

కిష్టాపూర్ ప్రధాన రహదారి, పేరూరు లింక్ రోడ్డు నిర్మాణ సమస్యలపై ఆవుల రాజిరెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో పాటు ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామితో మాట్లాడి రహదారుల నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇతర సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద శ్రీశైలం, వార్డు సభ్యులు పెద్దల కిషన్, తోష నవీన్, ఎంబరి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మల్కా ప్రవీణ్, వెంకటేశం, ప్రభాకర్, కుమార్, పెద్ది నరేష్, గావ్ కాని పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- నందికంది గ్రామంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేకగా నిలుస్తుందని టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మండలం నంది కంది గ్రామంలో గ్రామ సర్పంచ్ రాచర్ల స్రవంతి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సాంప్రదాయ ఆటలతో నందికంది చెరువు కట్ట ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ మహిళలు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి ఉత్సాహంగా ఆడి పాడారు. మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడిన నిర్మల జగ్గారెడ్డి. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పూజించే అరుదైన పూల పండుగ బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ఈ పండుగ చిహ్నంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శివ కుమార్, వార్డు సభ్యులు, నందికంది పిఎస్ సిఎస్ చైర్మన్ చింటూ గౌడ్,గ్రామ మహిళలు,యువకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా చండీహోమం



**నారాయణపేట, ఆక్టోబర్ 18 (జనం సాక్షి) :** మండలం, సింగారం శ్రీగిరి పీఠంపై కొలువైన భవానీమాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం భవానీమాత అమ్మవారు దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య దంపతుల అధ్వర్యంలో అమ్మవారికి మహా చండి హోమం నిర్వహించారు.భక్తులు, భవానీ దీక్షదారులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలను, భక్తులను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బాల్ రెడ్డి, కోంకల్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పెద్ద మల్లప్ప, అనంతరామ్, సురేష్, నగేష్, నరేందర్ రెడ్డి, సతీష్, కె. మల్లేష్, వెంకటప్ప, భజన మండలి సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం

- వనపర్తిలో 'వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ సీజన్-1' ప్రారంభం



**వనపర్తి, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం, సేవా సంకల్పానికి గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలో 'వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ సీజన్--1' ప్రారంభమైంది. హిందూ వాహిని ఆధ్వర్యంలో, బీజేపీ నాయకుల సహకారంతో జిల్లా స్థాయిలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. వనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం, ఛత్రపతి శివాజీ ప్రాంగణంలో నిర్వహించిన టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, కేతురి బుడ్డన్న, జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేశ్, సామాజిక సేవా కార్యకర్త గంధం నాగరాజు, హిందూ వాహిని జిల్లా కన్వీనర్ అరుణ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బోలమోని మణి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి యువ క్రీడాకారులను ప్రోత్సహించారు. యువత క్రీడల్లో రాణించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడం, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడం, స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువతను చైతన్యవంతం చేయడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

## వ్యాపార రంగంలో విజయం సాధించాలంటే కృషి, ఓర్పు అవసరం

- రైస్ మిల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** వ్యాపార రంగంలో రాణించాలంటే కష్టపడి పనిచేయడంతో పాటు ఓర్పు, నిబద్ధత ఎంతో అవసరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా మిల్లు నిర్వాహకుడు లక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. చేసే పనిని దైవంగా భావించి, అంకితభావంతో నిరంతరం కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఆర్థికంగా స్థిరపడేందుకు వ్యాపార రంగం మంచి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. నూతనంగా రైస్ మిల్లును ఏర్పాటు చేసి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన లక్ష్మారెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల అధ్యక్షులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

- మానవతా దృక్పథంతో రక్షించిన కృష్ణ 108 అంబులెన్స్ సిబ్బంది
- ప్రథమ చికిత్స,, ఆక్సిజన్ సాయంతో ఆసుపత్రికి తరలింపు
- 108 అంబులెన్స్ సిబ్బందిని అభినందించిన కృష్ణ రైల్వే స్టేషన్ మాస్టర్



**కృష్ణ, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం చేగుంట రైల్వే గేటుకు కిలోమీటరు దూరంలో రైల్వేట్రాక్ పక్కన పడి ఉన్న ఓ ప్రయాణి కుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కృష్ణ రైల్వే స్టేషన్ రైల్వే పోలీసులు వెంటనే కృష్ణ 108 అంబు లెన్స్ సిబ్బందికి సమాచారం అందించి, వెళ్లి అతడిని అతి కష్టం మీద అంబులెన్స్ లో ఉండే స్కూప్ స్ట్రెక్చ ర్ పైకి తీసుకొని ఒక కిలోమీ టర్ల దూరం నడుచు కుంటూ అంబులెన్స్ లోకి షిఫ్ట్ చేసుకుని, మార్గమ ధ్యలో రక్తస్రావాన్ని ఆపు తూ ప్రథమ చికిత్స చేస్తూ ఆక్సిజన్ అందిస్తూ తీసుకు వెళ్లి ఆసుపత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకు న్నారు. షాలి మార్- సికిం ద్రాబాద్ ఫలక్‌నుమా రైలు నుంచి జారిపడి, బీహార్ రాష్ట్ర నికి చెందిన "రాకేష్ కుమార్ సాహూ"ఆ వ్యక్తి జేబులో ఉన్న టికెట్ను పరి శీలిస్తే బెంగళూరు టు ఢిల్లీ అని ఉంది,కర్ణాటక ఎక్స్ప్రె స్ రైల్లో ప్రయాణిస్తూ కదు లుతున్న ట్రైన్ ను కృష్ణ చేగుంటకు మార్గమధ్యలో ట్రైన్ లో నుంచి, ఆ వ్యక్తి మద్యం మద్యం మత్తులో ఉండి ట్రైన్ లో నుంచి కింది కి పడిపోయి తలకు తీవ్ర మైన గాయాలు కావడంతో కృష్ణ రైల్వే పోలీసులు గమనించి వెంటనే కృష్ణ 108 అంబులెన్స్ కు సమా చారం ఇచ్చి . గేటు వద్ద అంబులెన్స్‌ను ఆపి స్ట్రక్చర్ మీద పడుకోబెట్టి ఒక కిలోమీటర్ పొడవునా ఆ వ్యక్తిని మోసుకుంటూ అంబులెన్స్ దగ్గరికి చేర్చి, అంబులెన్స్ లోనే ప్రథమ చికిత్స చేస్తూ కర్ణాటకలోని రాయచూరు జిల్లాలోని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. ప్రస్తుతం క్షత కాద్రుడు మధ్యమధ్యలో పడి ఉండవచ్చని అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళ నకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కృష్ణ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నారు.

## వనపర్తి అభివృద్ధికి సంపూర్ణ సహకారం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** వనపర్తి పట్టణ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని వనపర్తి సంస్థాన వారసుడు రాజా కృష్ణదేవరావు హామీ ఇచ్చారు. ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రాజా కృష్ణదేవరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు. వనపర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి రాజా కృష్ణదేవరావును కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రాజావారు పట్టణ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వనపర్తి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, పలువురు కౌన్సిలర్లు, పెబ్బేరు మండల అధ్యక్షుడు వ్యాపార రామిరెడ్డి, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు విష్ణు, విజయవర్ధన్ రెడ్డి, రంజిత్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీల హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

- బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో సమావేశం



**అచ్చంపేట, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** తెలంగాణలో బీసీల సమస్యలు, హక్కులు, సంక్షేమం, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చ తెలంగాణ రాష్ట్రంలో బీసీల సమస్యలు, హక్కులు, సంక్షేమం, ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులు, బీసీల హక్కుల పరిరక్షణ, సామాజికంగా, ఆర్థికంగా బీసీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీసీల అభ్యున్నతికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వాలు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా, వారి హక్కులు పరిరక్షించేలా సంఘాలు సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు. బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు బీసీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీసీ సంఘం ప్రతినిధులు ఎం. రేనయ్య, ఎం. మురళీమోహన్, వల్లూరి గోవర్ధన్, ఉద్యోగ సంఘాల నాయకులు కావలి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. వనపర్తి మండలం కందిరీగ తండా, వెంకటాపురం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కందిరీగ తండాకు చెందిన బీజేపీ సర్పంచ్ రాజు నాయక్, ఉపసర్పంచ్ సరోజ, హీరా సింగ్‌తో పాటు వార్డు సభ్యులు, మరో 150 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా, వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 122 మంది పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లో ఉన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వెంకటాపురం గ్రామం నుంచి మాజీ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వెంకటయ్య, మద్దిలేటి భార్య శారద, బక్కమ్మ, వార్డు సభ్యులు శ్రీను, జయమ్మ తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచులు రాములు, మురళి, గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు

- ప్రతి జర్నలిస్టుకు ఇంటి నిర్మాణ బిల్లులు కేటాయిస్తాం



**నారాయణఖేడ్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** ఇంటి స్థలాలు మంజూరై, ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు త్వరలోనే నిర్మాణ బిల్లులు అందజేస్తామని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. ఆదివారం ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ స్వగృహంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్‌తో కలిసి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్‌తో పాటు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రస్తుత ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినట్లు గుర్తుచేశారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన జర్నలిస్టులకు సంబంధించి బిల్లుల ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే అర్హులకు బిల్లులు అందజేస్తామని వెల్లడించారు. అలాగే అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించేందుకు, ఇల్లు నిర్మించుకునేలా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రతకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మానిక్ ప్రభు, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, కోశాధికారి ఇబ్రహీం, ఉపాధ్యక్షులు శరణప్ప, అంజనేయులు, ఫైయజ్, డైనియల్, సిద్ధరాం, పుండ్లిక్ నాగ్ శెట్టి, మోహన్ రాథోడ్, సలహాదారుడు అరుణ్, బాధ్యులు హాబీబ్ ఉల్లా, శయబాజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## శుద్ధ జలకేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**రాజాపూర్, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నాన్ చెరువు తాండాలో చించోడు అభిమన్యు రెడ్డి వారి నానమ్మ చించోడు రేణుకా దేవి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శుద్ధ జలకేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి . అనంతరం మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా, గిరిజన తాండాలో మినరల్ వాటర్ అందుబాటులోకి తెచ్చిన అభిమన్యు రెడ్డి ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, బుచ్చిరెడ్డి, రమేష్ నాయక్, సత్తయ్య, యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



# దసరాకు సారా సిద్ధం

- గ్రామాల్లో జోరుగా గుడుంబా తయారీ
- దసరా పండగకు భారీ ఏర్పాట్లు

**బెల్లంపల్లి, అక్టోబర్ 18, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గంలో దసరా పండగ నేపథ్యంలో గుడుంబా తయారీ ఊపందుకుంది. పండగలు వస్తే చాలు గ్రామాల్లో గుడుంబా ఏరులై పారుతుంది. గుడుంబా తయారీకి అవసరమయ్యే పటిక, బెల్లం సమీప బెల్లంపల్లి పట్టణం నుంచి యథేచ్ఛగా దిగుమతి అవుతుండటంతో తయారీ మరింత సులభతరంగా మారిపోయింది. అంతేకాకుండా తయారీకి ప్రత్యామ్నాయంగా యూరియా, చక్కెర, ఇతర ముడి పదార్థాలు స్థానికంగా లభిస్తుండటంతో గుడుంబా గుట్టు చప్పుడు కాకుండా తయారు అవుతుంది. అబ్కారి అధికారులు తమ దాడులతో బెంబేలెత్తిస్తున్నప్పటికి తయారీదారులు ఏమాత్రం జంకడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎక్కువగా అటవీ గ్రామాలే ఉన్నాయి. అటవీ ఆనుకొని ఉన్న గ్రామాల్లోనే గుడుంబా తయారీ జోరుగా కొనసాగుతుంది. అటవీ ప్రాంతంలో తయారీ దారులు రోజుకో అడ్డా మారుస్తూ పెద్ద ఎత్తున గుడుంబా తయారీ చేసి రవాణాకు పాల్పడుతున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, కన్నెపల్లి, బిమిని, వేమనపల్లి మండలాల్లో అధికంగా గుడుంబా తయారు చేస్తున్నారు. గతంలో ఇళ్ల పరిసరాలలో గుడుంబా తయారు చేసేవారు కాని అబ్కారి అధికారుల దాడులు అధికం కావడంతో గ్రామాలకు సమీపంలోని అటవీ ప్రాంతాలు, పొలాలు, చేలు, వాగులు, ఒర్రెల సమీపంలో గుట్టు చప్పుడు కాకుండా గుడుంబా తయారీకి పాల్పడుతున్నారు. ఎవరికి అనుమానం రాకుండా రాత్రి సమయంలో తయారీ సామాగ్రి తరలించి పగలు, రాత్రి తేడా లేకుండా పెద్ద ఎత్తున గుడుంబా తయారు చేస్తున్నారు. తయారు చేసిన గుడుంబాను మరో చోటికి తరలించి నిల్వ చేస్తున్నారు. ఆర్డర్లపై గ్రామాల్లోని విక్రయదారులకు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తీసుకెళ్లి డోర్ డెలివరీ చేస్తున్నారు.

**- నిత్యం దాడులు, మారని తీరు.**

గుడుంబా నియంత్రణపై పోలీసులు, అబ్కారి అధికారులు ప్రత్యేక దృష్టి సారించినప్పటికి అంత మొత్తంలో ఫలితం దక్కడం లేదు. పోలీసులు, అబ్కారి అధికారులు నిత్యం మూకుమ్మడిగా దాడులు నిర్వహించి వేలాది లీటర్ల బెల్లం పానకం, గుడుంబా ధ్వంసం చేసి కేసులు నమోదు చేస్తున్నప్పటికి తయారీ మాత్రం ఆగడం లేదు. అబ్కారి అధికారులు రూట్ వాచ్ లు, పెట్రోలింగ్ చేపడుతున్నప్పటికీ తయారీ దారులు అధికారుల కళ్లుగప్పి గుడుంబా సరఫరా చేస్తున్నారు. విక్రయదారులపై కేసులు నమోదైనప్పటికి ఏమాత్రం మార్పు రావడం లేదు. అబ్కారి శాఖ ఆధ్వర్యంలో నమోదు చేసే కేసులు కఠినతరంగా లేకపోవడంతోనే తయారీ దారులు మళ్ళీ తయారీకి పాల్పడుతున్నారు.



**- దసరాకు భలే గిరాకీ.**

పల్లెల్లో సాధారణ రోజుల్లోనే గుడుంబాకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. దసరా, బడగ, డిసెంబర్ 31 లాంటి సందర్భాలు వస్తే గుడుంబా మరింత ఎక్కువగా అమ్ముడు పోతుంది. లిక్కర్ కంటే తక్కువ ధరకు దొరకడంతో పాటు కిక్కు ఎక్కువగా ఉండటంతో గుడుంబా సేవించడానికి ప్రజల చూపుతున్నారు. దసరా పండగ దగ్గరకు రావడంతో ముందుగానే తయారీ దారులు పెద్ద ఎత్తున గుడుంబా తయారు చేసి పెట్టుకున్నారు. పల్లెల్లోనే కాకుండా పట్టణాలకు సరఫరా చేయడానికి సిద్ధం అయ్యారు. ఇప్పటికైనా అబ్కారి అధికారులు సారా పై చర్యలు తీసుకొని కొంతలో కొంతైనా గుడుంబా రవాణా నియంత్రించాలని కోరుతున్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, అక్టోబర్ 18, (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగుల పరిస్థితి, ఆసుపత్రికి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వ్యాధుల వివరాలు తెలుసుకుని వైద్యులకు పలు సూచనలు చేశారు. వార్డులను స్వయంగా పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండుగల వేళలలో కూడా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వైద్యులు తప్పనిసరిగా విధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ వార్డు నిరంతరం తెరిచి ఉంచాలని, కనీసం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

## అలంపూర్ జోగులాంబ అమ్మవారి రథోత్సవం - వైభవంగా సాగిన వేడుక

**జోగులాంబ గద్వాల,అక్టోబర్ 18( జనం సాక్షి):** అలంపూర్లోని ప్రసిద్ధ 5వ శక్తి పీఠం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నేడు అమ్మవారి రథోత్సవాన్ని అత్యంత నేత్రానందకరంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవ వేడుకలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు.ఆలయ మాడ వీధుల గుండా సాగిన ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.'ఓం శక్తి.. మహాశక్తి' అంటూ భక్తులు చేసిన ఆధ్యాత్మిక నినాదాలు, మంగళవాయిద్యాల నడుమ రథం ముందుకు సాగింది.ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ అధికారులు, పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం కమిటీ వారు ప్రత్యేకంగా తీర్థప్రసాదాలు, తాగునీటి వసతి కల్పించారు. ఈ మహోత్తర ఘట్టాన్ని కళ్లారా వీక్షించిన భక్తులు అమ్మవారి కృపకు పాత్రులై, మానసిక ప్రశాంతతను పొందామని హర్షం వ్యక్తం చేశారు.



## కడెం మండలంలో బెల్ట్ షాపుల జోరు

**కాడెం: అక్టోబర్ 18 (జనం సాక్షి):** మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా అక్రమ మద్యం రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ షాపుల వల్ల యువత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. 18 ఏళ్లు నిండని మైనర్లు కూడా సులభంగా మద్యం అందుబాటులోకి వస్తుండటంతో పెడదోవ పడుతున్నారు. మద్యం తాగి రోడ్లపై సీసాలు పగలగొట్టడం వల్ల ప్రయాణికులు, పంట పొలాల్లో తిరిగే రైతులు గాజు ముక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతుండగా, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. సంబంధిత ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి అక్రమ బెల్ట్ షాపులను సీజ్ చేయాలని, యువత భవిష్యత్తును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## అసైన్డ్ భూముల గుంజివేతేనా ప్రజాపాలన?

**మరలకుంట తండాలో ఎన్ఐయూఎం శంకుస్థాపనపై పోరాట కమిటీ ఆగ్రహం**

**యాచారం, అక్టోబర్ 18 (జనంసాక్షి):** ప్రజాపాలన పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల నోట్లో మన్ను కొడుతోందని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. యాచారం మండలం కుర్మిద్ద గ్రామ పరిధిలోని మరలకుంట తండా వద్ద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో కమిటీ ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా రైతుల భూములను కాపాడుతామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేసింది. ఇందిరమ్మ పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కేసీఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటోందని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించింది. అసైన్డ్ భూములపై న్యాయస్థానం స్టే ఉన్నప్పటికీ పోలీసు బలగాలను మోహరించి రైతులను బెదిరిస్తున్నారని ఆరోపించింది. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన వారిపైనా ఒత్తిడి తెచ్చి బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. రైతులతో ఎలాంటి చర్చలు జరపకుండా వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడమేనా ప్రజాపాలన అని నిలదీసింది. ముఖ్యమంత్రి పర్యటన సమాచారాన్ని సైతం రహస్యంగా ఉంచుతున్నారని, నిజంగా ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి రైతులంటే ఎందుకంత భయమని ప్రశ్నించింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఫార్మా సిటీ జీవోను తక్షణమే రద్దు చేసి రైతుల భూములను కాపాడాలని డిమాండ్ చేసింది. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటేనే ప్రజలు ఆదరిస్తారని, ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ కోరింది.

## బతుకమ్మ వేడుకల్లో సిబ్బంది కొరతపై మహిళల అసహనం

**ఏర్పాట్ల నిర్వహణపై మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు**

**నర్సంపేట, అక్టోబర్ 18: ( జనం సాక్షి):** నర్సంపేట పట్టణంలో బతుకమ్మ దసరా వేడుకలు ఘనంగా నిర్వహించినప్పటికీ, అవసరమైన స్థాయిలో మున్సిపల్ సిబ్బందిని కేటాయించకపోవడంతో కొంతమంది మహిళలు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసే సమయంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని సమాచారం.
వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరైన నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచి, నిమజ్జన కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది కేటాయింపు, ఏర్పాట్ల నిర్వహణపై విమర్శలు వ్యక్తమయ్యాయి.
భవిష్యత్తులో ఇలాంటి వేడుకల సందర్భంగా మహిళలకు అసౌకర్యం కలగకుండా తగినంత సిబ్బందిని కేటాయించి, నిమజ్జన ఏర్పాట్లను మెరుగుపరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## హెచ్ఐవీ బాధితులకు అండగా కార్నర్‌స్టోన్ ఫౌండేషన్

- 32 మంది బాధితులకు నూతన వస్త్రాలు, పౌష్టికాహారం పంపిణీ
- ప్రతి నెలా మెదక్ జిల్లాలోని 7 మండలాల్లో కార్యక్రమాలు : ఆజాద్ జానీ

**తూప్రాన్, అక్టోబర్ 18 (జనం సాక్షి):** హెచ్ఐవీ బాధితులు మనోధైర్యాన్ని కోల్పోకుండా, ఆత్మవిశ్వాసంతో జీవించాలని, క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకుంటూ, పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సికింద్రాబాద్ కార్నర్‌స్టోన్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆజాద్ జానీ పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా, మానవతా దృక్పథంతో అండగా నిలవాలని ఆయన కోరారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఆదివారం తూప్రాన్ పట్టణంలోని ఫాతిమా మాత చర్చిలో కార్నర్‌స్టోన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 32 మంది హెచ్ఐవీ బాధితులకు నూతన వస్త్రాలు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పండుగ వేళ వారిలో ఆనందం నింపడంతో పాటు, తాము ఒంటరి కాదనే భరోసా కల్పించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆజాద్ జానీ మాట్లాడుతూ తమ సంస్థ తెలంగాణలోని వివిధ జిల్లాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేద హెచ్ఐవీ బాధితులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఇకపై ప్రతి నెలా మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, మాసాయి పేట, చేగుంట, శివంపేట, నార్సింగి, వెల్దుర్తి మండలాలకు చెందిన నిరుపేద హెచ్ఐవీ బాధితులకు సంస్థ తరపున సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఈ కార్య క్రమంలో కార్నర్‌స్టోన్ ఫౌండేషన్ సభ్యులు ఇమ్మానియేల్, సుమన్, సామ్యూల్, ఏనోష్, ఫాతిమా మాత చర్చి ఫాదర్ ధనరాజ్, ఉమ్మడి మెదక్ జిల్లా సోషల్ వర్కర్ కె. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.




## బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికుల ఫైల్ ఎక్కడ?

- జిల్లాలో మలేరియా అధికారి ఉన్నారా.. లేరా ?
- విధుల్లోకి తీసుకోవడం పట్ల నిర్లక్ష్యం దేనికో ?
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్
- విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకోలు

**చెన్నారావుపేట, అక్టోబర్ 18 (జనం సాక్షి):** బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించిన ఫైల్ ఎక్కడ ఉందోనని బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకొని గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్వే, స్ప్రే లాంటి కార్యక్రమాలు చేయించాలని మూడు నెలల క్రితం ఆదేశాలను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకొని గ్రామాలలో పనులను చేయిస్తుంది. కానీ వరంగల్ జిల్లాలో మాత్రం బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడం పట్ల సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు బహటంగా వినిపిస్తున్నాయి. అసలు వరంగల్ జిల్లాలో జిల్లా మలేరియా అధికారి ఉన్నారా... లేరా... ఉంటే ఎందుకు వారి పట్ల వివక్ష చూపుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక విధుల్లోకి తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించిన ఫైల్ పై ఇప్పటివరకు సంతకం చేయించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులు జిల్లా కలెక్టర్ సత్య శారదను పలుమార్లు కలిసి ఫిర్యాదులను సైతం అందించారు. ఈనెల 12న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు నేరుగా తమను విధుల్లోకి తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులు తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయగానే జిల్లా కలెక్టర్ సత్య శారద బ్రీడింగ్ చెక్కర్స్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల్లో విధుల్లోకి తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులకు హామీ ఇచ్చి ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోకపోవడంతో బ్రీడింగ్ చెక్కర్స్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో జిల్లా మలేరియా అధికారిని రజిత రెడ్డి విధులకు సరిగా రాకుండా తమను విధుల్లోకి తీసుకోవడం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకొని గ్రామాలలో సీజనల్ వ్యాధులపై సర్వే, స్ప్రే లాంటి కార్యక్రమాలను చేయించాలని బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరం గల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిన్నపెల్లి దేవేందర్, ముత్యం రాజు, శేఖర్, రామ్ చందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్ కుమార్, సిహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లావుద్దిన్, తదితరులు కోరుతున్నారు.



## బిఎల్ఎలను ఢిల్లీలో రాహుల్ గాంధీతో కల్పిస్తా

**బిఎల్ఏ ల మీటింగ్ లో పాల్గొన్న మంత్రి**

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 18 జనంసాక్షి:** సర్ ప్రక్రియలో అర్హులైన కొత్త ఓటర్లను ఓటరు జాబితాలో నమోదు చేసే బాధ్యత బిఎల్ఏ లే తీసుకోవాలని బిఎల్ఓ లకు ప్రజలు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు సహకరించాలని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.
ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని మంత్రి నివాసంలో ఏర్పాటుచేసిన బిఎల్ఏ ల సమావేశంలో ఆయన బిఎల్ఓ లను ఉద్దేశించి మాట్లాడుతూ... మరో వారం రోజులు కొత్త ఓటర్ల నమోదుకు గడువు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన తెలిపారు. వంద శాతం ఓటర్ నమోదు కు సహకరించిన బిఎల్ఏ లను ఢిల్లీలో రాహుల్ గాంధీతో కల్పిస్తానని పేర్కొన్నారు .ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు అలాగే రైతులు అత్యధికంగా నీటిని ఉపయోగించే వరి పంటను కాకుండా ఆరుతడి పంటల దిశగా ముందు వెళ్లాలని పేర్కొన్నారు. ఎల్ నినో లాంటి పకృతి విధ్వంసాలు వచ్చినప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటివరకు చెక్కుచెదరలేదని ఆయన పేర్కొన్నారు.
బిఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల తో కెసిఆర్ నిర్మించిన ప్రాజెక్టు కుంగిందని , నాణ్యత లోపం,అవకతవకలే కారణంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించినట్లయితే సాగునీటికి ఇబ్బందులు ఉండేవి కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు 20 ఎకరాల భూమి మీద ఉన్న కెసిఆర్ కుటుంబానికి ఇవాళ 300 ఎకరాల భూమి అక్రమంగా సంపాదించారని ఆరోపించారు .పదేళ్ల కాలంలో ఎన్ని వందల కోట్ల రూపాయలు ఎక్కడ నుండి ఎలా సంపాదించారని పేర్కొన్నారు.




## రూ.38 లక్షలతో బతుకమ్మ సంబరాలు

**నర్సంపేటలో అంబరాన్నంటిన వేడుకలు!**

**నర్సంపేట, అక్టోబర్ 18 (జనం సాక్షి):** నర్సంపేట పట్టణంలో బతుకమ్మ దసరా వేడుకలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూల పండుగ బతుకమ్మను పురస్కరించుకుని పట్టణంలో రంగురంగుల పూల అలంకరణలు, ప్రత్యేక ఏర్పాట్లతో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ వేడుకల నిర్వహణ కోసం రూ.38 లక్షలు ఖర్చు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి రామనాథం తెలిపారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 మంది కౌన్సిలర్ల సహకారంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.
బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని, ఇటువంటి వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని తెలిపారు. పట్టణ ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ దసరా వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు.



## పిల్లలు తప్పిపోకుండా హ్యాండ్ బ్యాండ్

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని ఉరుసు గుట్ట రంగ లీల మైదానం వద్ద సద్దుల బతుకమ్మ పర్వదినం సందర్భంగా ఆదివారం సాయంత్రం బతుకమ్మలతో వచ్చిన మహిళల పిల్లల రక్షణలో భాగంగా పిల్లలకి హ్యాండ్ బ్యాండ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఖిలా వరంగల్ మండల తాసిల్దార్ ఇక్బాల్ ప్రారంభించారు. ఐసిడిఎస్ వరంగల్ ఆధ్వర్యంలో 41 డివిజన్ ఉరుసు సెక్టార్ కు చెందిన అంగన్వాడి టీచర్లు పిల్లలు ఎవరైనా తప్పిపోతే వాళ్ల చేతికి బ్యాండ్ వేసి వాళ్ళ పేరు సెల్ నెంబరు ఇతర వివరాలను బ్యాండ్ మీద రాసి రాసిపెట్టారు. ఈ కార్యక్రమంలో కే .జయ, ఆర్. సుహాసిని, మమతా, సుజాత, రెహానా జీనత్ తదితరులు పాల్గొన్నారు.



## 8 నెలలుగా వృథాగా మిషన్ భగీరథ నీరు

- పట్టించుకోని అధికారులు

**మరిపెడ, అక్టోబర్ 18 (జనంసాక్షి):** ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తుంటే పైపు లీకేజీ వల్ల వృథాగా పోతున్న నీటిని అరికట్టలేకపోతున్న అధికారు మరిపెడ మండలం లోని అబ్బాయి పాలెం గ్రామ శివారు దారావత్ తండా వద్ద మెయిన్ పైప్ లైన్ నుండి తాగునీరు వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని . వారి నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతుందని. మరిపెడ మండలం లో మరిపెడ నుండి నర్సంపేట వరకు నీటి సప్లై వెళ్లే మెయిన్ లైన్లో ఫస్ట్ సెమ్ దగ్గర లీకేజీలు ఏర్పడటం దీంతో గత 8నెలలుగా పైపు నుండి ఎక్కువగా నీరు లీకు అవడంతో ఎక్కువ మొత్తంలో మీరు పోతుందని ప్రజలు పలుమార్లు అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదని తండావాసులు తెలుపుతున్నారు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతుంటే.. అధికారులకు తెలిసి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీరు వృథాగా పోతున్నాయి. పక్కనే ఉన్న వరి పొలంలోకి వస్తుందని పంట చేతికి వచ్చే సమయంలో నీరుని అరికట్టకపోతే నా పంట చేను కూడా వృథా అవుతుందని స్థానిక పంట పొలం రైతు సెక్రు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు
లీకేజీలు రహదారి పక్కనే త్రాగునీరు వృథాగా పోతున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తండా ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ లీకేజీలను గుర్తించి, తాగునీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని తండ ప్రజలు కోరుతున్నారు.
మిషన్ భగీరథ పైప్‌లైన్ లేదా నీటి సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా లీకేజీలు ఉంటే వాటిని త్వరగా మరమ్మతులు చేయిస్తామని సహాయక ఇంజనీర్ (రాజు) అవినాష్ అన్నారు సాధారణంగా ఇతర పైపులైన్లు సప్లై ని ఆపి వెంటనే మరమ్మతులు చేసే విధంగా ఉంటుందని కానీ దారావత్ తండా దగ్గర మరిపెడ నుండి నర్సంపేట వాటర్ మెయిన్ సప్లై ఫస్ట్ సెమ్ కావడంతో అధిక ప్రెషర్ ఉంటుంది నర్సంపేట వరకు నీటి సప్లై నిలిపి పనులు చేయాల్సి ఉంటుంది కాబట్టి జాప్యం జరిగిందని ఈ వారం రోజుల్లో కచ్చితంగా మరమ్మత్తులు చేయించి పైపులు లీకులు లేకుండా చూస్తామని వారు తెలిపారు.



## మీడియా సమాజానికి దిక్సూచి

- విలేకరులు సమాజానికి నాలుగో స్తంభం
- కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** మీడియా సమాజానికి దిక్సూచి లాంటిదని, ప్రభుత్వాలకు ప్రజలకు వారధి లాంటిదని కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి అన్నారు. ఆదివారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన వారు జర్నలిస్టుల కోసం పదివేల రూపాయల విలువైన జర్నలిజం పుస్తకాలను బహుకరించారు. అదేవిధంగా తమవంతుగా ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం రూ.10016 లు నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన పాల్వంచ పరిసర ప్రాంతాలను విద్య వైద్య రంగాలలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రత్యుపకారం ఆశించకుండా సమాజ సేవ చేస్తున్న కొల్లి ఫౌండేషన్ కు తమవంతుగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, ఫౌండేషన్ ద్వారా చేసే కార్యక్రమాలలో భాగస్వాములము అవుతామ ని తెలిపారు.కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్బురం కార్యదర్శి లెనిన్, సీనియర్ పాత్రికేయులు జైనుల, సుభాని కృష్ణమూర్తి, నరసింహారావు, నాగేశ్వరరావు, సందీప్, కిషోర్, వెంకటనారాయణ, జీవి రత్నం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు జగదీష్, ముత్యాల శేఖర్ అక్బర్ జర్నలిస్టులు, కొల్లి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం / ఎన్కూరు, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం. ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి ఏన్కూరు నుండి నాచారం వరకు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఆపదమొక్కులవాడు, అడిగిన కోరికలు తీర్చే అద్భుత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ రహదారి నిర్మాణంతో భక్తుల రాకపోకలతో పాటు స్థానికంగా హోటళ్లు, వ్యాపారాలు పెరిగి ఆదాయ వనరులు పెంపొందుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి దాదాపు రూ. 2,500 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. చారిత్రక భద్రాచల దేవస్థాన సమగ్ర అభివృద్ధికి రూ. 276 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేశామని, పిల్లల అక్షరాభ్యాస క్షేత్రమైన బాసర దేవాలయ అభివృద్ధికి రూ. 354 కోట్లు కేటాయించామన్నారు.తెలంగాణలో కోటి 15 లక్షల కుటుంబాలు వుండగా , అందులో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ



చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ, 53 లక్షల కుటుంబాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించామని డిప్యూటీ సీఎం అన్నారు.

కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు మిగిల్చినప్పటికీ, కష్టకాలంలో కూడా ఆర్థిక సర్దుబాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని జిల్లా వాసిగా, అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నారన్నారు. గుడికి రోడ్లు వేయాలని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ. 43 కోట్లు మంజూరు చేసి, ఏన్కూరు నుంచి నాచారం మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు.ఏన్కూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఐటిఐ, గోడౌన్ల మంజూరుతో పాటు ఈ ప్రాంతానికి కావలసిన రోడ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాచారం నుండి జూలూరుపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని, ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలోని దాదాపు 10 మండలాలకు లింక్ కలుగుతుందని, 7 నుండి 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు మంజూరుకు డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ ఋణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.

అంతకుముందు డిప్యూటీ సీఎం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిఈ సురేందర్, ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం కారణంగా యాసంగిలో వరి సాగు చేయవద్దు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** సూపర్ ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు రానున్న 8 నెలల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, త్రాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గత ఏడాది వర్షపాతంతో పోల్చి ప్రస్తుత ఏడాది మండలాల వారీగా వర్షపాత వివరాలను పరిశీలించాలని, లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న మండలాలను గుర్తించి, రానున్న రోజుల్లో వాటి పరిస్థితిపై క్రమం తప్పకుండా అంచనాలు రూపొందించాలని, ఈ వివరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న 8 నెలలకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, అవసరమైన సహకారం కోసం ప్రభుత్వానికి నివేదించాలని తెలిపారు. సమీక్షలో చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయ నున్నట్లు అన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో 5



మీటర్లు, ఎర్రుపాలెం మండలంలో 6.5 మీటర్లు, ఏన్కూరు, సత్తుపల్లి మండలాల్లో 5 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 10 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యాన పంటలు ఎండిపోయే పరిస్థితి లేదని, ఖరీఫ్‌లోనూ పెద్దగా ఇబ్బందులు లేవని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాధార పంటలు, పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని వివరించారు. గత ఏడాది 175 డీటీఆర్‌లకు, ఈ ఏడాది 214 డీటీఆర్‌లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, భూగర్భజల, విద్యుత్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**సూర్యాపేట, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిరక్ష్యం, పరిపాలనా వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావట్లేదని అన్నారు. రాష్టంలో కరువు పరిస్థితి స్పష్టంగా కనపడుతుందన్నారు. తెలంగాణ నుంచి పారుతున్న నీళ్లతోనే ఆంధ్ర లబ్ధి పొందుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కృష్ణలో మనం 18 టీఎంసీల నీళ్లు కూడా వాడలేదన్నారు.కన్నెపల్లి పంపు హౌస్ ఆన్ చేస్తే ప్రతి చెరువు మత్తడి దునికేదని, తెలంగాణ ప్రాజెక్ట్ లన్నీ నిండుకుండలా ఉండేవని, గోదావరి నుండి 250 టీఎంసీలు ఎత్తుకునే వాళ్లమని తెలిపారు.మాజీ సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణకు కరువు అనేదే లేదని, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని తెలిపారు.కేవలం ఈ ప్రభుత్వం నిరక్ష్యం వల్లనే కరువు పరిస్థితి దాపురించిందన్నారు.సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుకు తట్టెడు మట్టి, మాలు అవసరం లేకుండానే ప్రారంభించవచ్చని పేర్కొన్నారు.ఎల్ నినో వస్తదని ఏడాది ముందు నుంచే నిపుణులు చెబుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో రెప్పపాటు కరెంట్ పోనీ రాష్ట్రంగా రికార్డు సృష్టించిందన్నారు.కానీ ప్రస్తుతం




రాష్ట్రంలో కరెంట్, నీళ్ల సమస్య ఎవరిని అడిగినా చెప్తారని అన్నారు.యాదాద్రి పవర్ ప్లాంట్ విషయంలో వాళ్లు మాట్లాడేవన్నీ నిజాలు కావన్నారు.ఈ కరువుకు ఎల్ నినో కారణం కాదని,రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు.మళ్లీ కేసీఆర్ రాగానే అన్నింటిని ఎలా పునరావృతం చేసుకోవాలో తమకు తెలుసనని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఉప్పల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వలపాలెం బ్రిడ్జి వద్ద యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

### ఫొటోలు తీయడానికి వెళ్లిన స్థానిక విలేకరిపై అడ్డగింపు

### పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు..?



మాడుగులపల్లి, అక్టోబర్ 18 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని కల్వలపాలెం బ్రిడ్జి సమీపంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది నిబంధనలకు విరుద్ధంగా 24 గంటలు ఎలాంటి అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు మండలంలోని పలు ప్రాంతాలతో పాటు కల్వలపాలెం బ్రిడ్జి పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో మాడుగులపల్లి మండల విలేకరి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు ఈ క్రమంలో అక్కడే ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న దృశ్యాలను విలేకరి తన మొబైల్‌లో ఫొటోలు తీయడానికి ప్రయత్నించగా, అక్కడున్న వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

**అధికారుల మౌనం వెనుక ఆంతర్య**

ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కఠిన ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, గ్రౌండ్ స్థాయిలో మాత్రం ఇసుక మాఫియా చెలరేగుతోంది రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ దందా సాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి కల్వలపాలెం బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## దమ్మపేటలో నాటు తుపాకీ, గంజాయి పట్టివేత

- ఆరుగురు నిందితుల అరెస్టు..



**దమ్మపేట, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** దమ్మపేట మండలంలో అటవీ శాఖ,పోలీసుల సంయుక్త చర్యల్లో నాటు తుపాకీతో పాటు సుమారు రూ.3 లక్షల విలువైన 5.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. దమ్మపేట మండలం కోడిశాలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి నాగు ఇంట్లో అటవీ జంతువుల వేటకు ఉపయోగించే నాటు తుపాకీ ఉందన్న పక్కా సమాచారంతో దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీను తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న పెనుబల్లి నాగు,పెనుబల్లి రవి,తాటి సాయికృష్ణ,పెనుబల్లి శ్రీను,తాటి నవీన్, సప్పిడి సమ్మయ్య వద్ద నుంచి 5.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెనుబల్లి శ్రీను వద్ద అనుమతులు లేని నాటు తుపాకీతో పాటు వేటకు ఉపయోగించే మందుగుండు సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.విచారణలో అటవీ జంతువులను వేటాడేందుకు నాటు తుపాకీని ఉపయోగిస్తున్నట్లు వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్–ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని డొంకరాయి ప్రాంతానికి మోటార్‌సైకిల్‌పై వెళ్లి రామ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి,దమ్మపేట మండలంలో గంజాయి వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న గంజాయి బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3 లక్షల విలువ చేస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై ఫారెస్ట్ రేంజ్ అధికారి ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ చర్యల్లో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు,దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీను,దమ్మపేట ఎస్సై రాజేష్‌తో పాటు పోలీసు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా పండుగను ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలి

- ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ
- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** జిల్లా ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు.పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.పండుగ వేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.బెట్టింగ్‌లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, పండుగలను సంప్రదాయబద్ధంగా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 112, సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్స్ 8712686026, 8712686057 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రజా పాలన లక్ష్యం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, అక్టోబర్ 18(జనంసాక్షి): పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో తహశీల్దార్ లంకపల్లి వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ ప్రజా పాలన సాగుతోందని అన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఆటంకాలు ఎదురైనా కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదల కు అందించే సంక్షేమ పథకాల కోసం నిరంతరాయం గా కృషి



చేస్తుందన్నారు.కళ్యాణలక్ష్మి, షాదీము బారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం అందిస్తున్న తరహాలో పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో ఎంతో మంది విద్యార్థులభవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. దేశ యువత బీజేపీకి వ్యతిరేకంగా నిలిచి, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు,టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ,టేకులపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యాం, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్ రావు, సర్పంచులు కోరం సుభాష్ చంద్రబోస్, గుగులోతు లక్ష్మానాయక్, కోరం హనుమంతు, నాయకులు ఈది గణేష్, టేకులపల్లి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యా నాయక్, ఉప సర్పంచ్ చేతులు నాగేశ్వరరావు, బానోతు రవి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ గోదాం మేనేజర్ ఆత్మహత్య కేసులో ఆరుగురిపై కేసు

- నలుగురు విలేకర్లు, కాంట్రాక్టు ఉద్యోగినితో పాటు మరో వ్యక్తిపై అభియోగాలు

**భద్రాచలం, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** పాల్వంచలోని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎల్‌పీజీ కేంద్రం మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ (56) ఆత్మహత్య కేసులో ఆరుగురిపై భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి కుమార్తె అనంతుల మధులిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు.

లలక్ష్మీనారాయణ తన ఆత్మహత్యకు ఆరుగురు కారణమంటూ సూసైడ్ నోట్ రాసినట్లు కుమార్తె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్యాస్ గోదాంలో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న రంజితతో పాటు విలేకర్లుగా పేర్కొన్న నాగచందు, ఖలీమ్, రవి, వెంకన్న తదితరులపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నిందితులు తన తండ్రిని వేధించడంతో పాటు, ఫిర్యాదును ఉపసంహరించుకోవాలంటే రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు మధులిక ఆరోపించారు. వేధింపులు భరించలేక లక్ష్మీనారాయణ శనివారం భద్రాచలంలోని గోదావరి లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై భద్రాచలం సీఐ సట్ల రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19.10.2026

## ప్రతీ ఒక్కరు ఆర్థికంగా ఎదగాలి

- మహిళా సోదరిమణులు పాడి పరిశ్రమల వైపు ముందుకెళ్లాలి
- త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం
- 400 మందికి ఉపాధి అవకాశాలు
- ఎల్ నినో కారణంగా వనరులను పొదుపుగా వాడండి : మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, అక్టోబర్ 18, (జనంసాక్షి ):** మంథనిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కోటి రూపాయల విలువైన 302 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, అలీఫ్, డీఆర్డీఏ, మెప్మా, సీఎస్ఆర్ సంస్థల సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసిన 600 మందికి 600 మందికి కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటివరకు 3,040 మందికి ఉచిత కుట్టు శిక్షణ అందించి, సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనం తరం మెప్మా ఆధ్వర్యంలో మంథని పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహిళా ఇందిరా శక్తి పథకం కింద మంజూరైన నూతన ఆయిల్ మిల్లును మంత్రి శ్రీధర్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు.మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అంగన్వాడి, వివో భవనాలకు కోట్ల 14 కోట్ల 76 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. జయశంకర్ జిల్లా భూపాలపల్లిలో మన నియోజక వర్గానికి 12 కోట్ల 58 లక్షలను మంజూరు చేయడం జరిగింది అన్నారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ,విజయదశమి శు భాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో ,పాడిపం టలతో,చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరారు. ప్రత్యేకంగా మరి ఈ ప్రాంతంలో నేను గెలిచిన మొదటి సంవత్సరం నుంచి కుట్టు మిషన్లకు సంబంధించిన శిక్షణ ఇప్పియడం జరిగిందన్నారు. త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఫ్యాక్టరీ ద్వారా 300 మంది నుండి 400 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మహిళా సోదరిమణులు పాడి పరిశ్రమల వైపు ముందుకెళ్లాలి.. ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలి మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఎల్ నినో కారణంగా నీరు, విద్యుత్ వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, మున్సిపల్ చైర్మన్ వడ్లాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, విద్యుత్ నియంత్రణ సలహా మండలి సభ్యులు శశి భూషణ్ కాచే, ఆర్టీపీ మెంబర్ మంథని సురేష్, కౌన్సిలర్లు, సింగల్ విండో చెర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, మాజీ ఎంపీపీ కొండా శంకర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెండ్రు రమ సురేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో మెడల్..

**ఘనత సాధించిన కానిస్టేబుల్ మహిపాల్**

**జక్రాన్‌పల్లి, అక్టోబర్ 18 (జనంసాక్షి):** ఢిల్లీలో నిర్వహించిన వేదాంత ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ పిల్లి మహిపాల్ ప్రతిభ చాటాడు. జక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన మహిపాల్ ఈ మారథాన్‌లో పాల్గొని 2 గంటల 12 నిమిషాల్లో పరుగు పూర్తి చేసి మెడల్ సాధించాడు.పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపాల్, విధి నిర్వహణతో పాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యత ఇస్తూ మారథాన్‌లో పాల్గొనడం విశేషం. నిరంతర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసి తన సత్తా చాటాడు.మహిపాల్ మెడల్ సాధించడంతో పడకల్ గ్రామంతో పాటు స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఆయన విజయంపై పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.



### 'జనంసాక్షి' కథనానికి సర్పంచుల హర్షం

**నిజమైన జర్నలిజం అంటే ఇదేనని ప్రశంసలు**

**గన్నేరువరం, అక్టోబర్ 18 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలో దసరా పేరుతో నకిలీ విలేకరుల బెడదపై జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి విశేష స్పందన లభించింది. మా సమస్యను ధైర్యంగా బయటపెట్టిన జనంసాక్షి పత్రికకు మండల సర్పంచుల ఫోరం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల సర్పంచులు స్పందిస్తూ, "ఇన్నాళ్లు నకిలీ విలేకరుల వేధింపులతో బిక్కుబిక్కుమంటూ గడిపాము. ఎవరికీ చెప్పుకోలేకపోయాము. జనంసాక్షి మా గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇదే నిజమైన జర్నలిజం. ఇలాంటి నిర్భయ జర్నలిజం వల్లనే గ్రామ పాలన సజావుగా సాగుతుంది" అని సంతోషం వ్యక్తం చేశారు. నకిలీ విలేకరుల ఆగడాలపై జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్రిడిటేషన్ లేని వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. జనంసాక్షి కథనం తర్వాత మండలంలో నకిలీ విలేకరుల హడావుడి తగ్గినట్టు సమాచారం.

### గుంతలు పూడ్చలేని అధికారులు

- గ్రామపంచాయతీ సొంత ఖర్చుతో మరమ్మతులు
- రోడ్ల దుస్థితిపై అధికారుల తీరుపై మండిపాటు

**ఇల్లంతకుంట, అక్టోబర్ 18 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రహదారులు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లు లేకపోగా, ఉన్న డాంబర్ రహదారులు సైతం గుంతలమయంగా మారాయని, దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, గత 34 నెలల్లో మండలంలో కనీసం గుంతలను కూడా పూడ్చలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. నర్సక్కపేట గ్రామపంచాయతీ పరిధిలో రహదారిపై గుంతలను గ్రామపంచాయతీ సొంత ఖర్చుతో సిమెంట్, కంకరతో పూడ్చి మరమ్మతులు చేయడం అధికారుల పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న రహదారులపై అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని, నిర్లక్ష్య ధోరణిని వీడి ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలని బెంద్రం తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు.



## ఖిల్లా రామాలయానికి రోప్‌వే..

**తొందర్లోనే డీపీఆర్**

**నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం...**

**ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు.ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### దసరా కిక్కు టార్గెట్ @రూ.1000 కోట్లు

**అదనపు ఆదాయంపై ఎక్సయిజ్ శాఖ అంచనా**



**కామారెడ్డి అక్టోబర్ 18(జనంసాక్షి):** కొనుగోళ్లు పెంచుతున్న వైన్ షాపు యజమానులు సెలవులు కావడంతో మొదలైన పండుగ జోష్ మరో నాలుగు రోజుల్లో డబుల్ అమ్మకాలు ఈ దసరా పండుగ సందర్భంగా అదనంగా సుమారు రూ.1000 కోట్లకు పైగా సంపాదించాలని ఎక్సయిజ్ శాఖ టార్గెట్ పెట్టుకున్నట్టు తెలిసింది. అందుకు అనుగుణంగా లిక్కర్ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వైన్ షాప్ ఓనర్లు రెగ్యూలర్ కొనుగోళ్ల కంటే అదనపు లిక్కర్ కోసం బేవరేజ్ కార్పొ రేషన్ ను ఆశ్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. గత ఏడాది దసరా గాంధీ జయంతి (అక్టోబర్ 2)న రావడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగలేదు. ఈసారి మాత్రం అం చనాలకు తగ్గట్టుగా విక్రయాలు ఉంటాయని అబ్కారీ శాఖ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**పక్షం రోజులుగా పెరిగిన సప్లయ్**

రాష్ట్రంలో బోనాల పండుగ నుంచి లిక్కర్ సేల్స్ క్రమంగా పెరిగి, దసరా పండుగ నాటికి విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. ఈసారి కూడా జులై రెండోవారం (ఆషాఢమాసం) నుంచి వైన్స్ విక్రయాలు పెరిగాయి. శ్రావణ మాసంలో కాస్త తగ్గినా మళ్లీ సెప్టెంబర్ మొదటి వారం నుంచి లిక్కర్ కొనుగోళ్లు పుంజుకున్నాయి. దసరా పండగ నాటికి మరింత ఊపందుకుంటుందని ఎక్సయిజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే లిక్కర్ షాపు ఓనర్లు ప్రతి నెలలో కొనుగోలు చేసే మొత్తం కంటే అదనపు లిక్కర్ను బేవరేజ్ కార్పొరేషన్ నుంచి సేకరిస్తున్నట్టు చెప్తున్నారు. అందుకోసం అదనపు రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దసరా సీజన్లో మందుతోపాటు బీర్ల సేల్స్ కూడా రెండింతలు పెరగటం సహజం. దీనితో నెల రోజుల క్రితం నుంచి ఉత్పత్తిని డబుల్ చేసినట్టు తెలిసింది. గత ఏడాది దసరా పండుగ, గాంధీ జయంతి (అక్టోబరు 2) ఒకేరోజు రావడంతో ఆశించిన స్థాయిలో మద్యం విక్రయాలు జరగలేదు. అయినా సుమారు రూ.700 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఈసారి మాత్రం 1000 కోట్ల మద్యం అమ్మకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించిందని సమాచారం.

### ఖోఖో పోటీల్లో కరీంనగర్‌కు కాంస్యం

**బాలుర జట్టును అభినందించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ కల్చరల్(జనంసాక్షి):** 45వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు కాంస్య పతకం సాధించింది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని 12 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బాలుర జట్టును అభినందించారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, రాష్ట్ర టెక్నికల్ అఫీషియల్ మెంబర్ వంగపల్లి సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, జిల్లా బాధ్యులు డా. ఎ. రవీందర్, కట్ట సంతోష్, యోగేష్, కోచ్‌లు డప్పు రమేష్, వెంకటేష్, దుర్గాదాస్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.





### మంత్రి వివేక్ ప్రోత్సాహం..

**జర్మనీలో దళిత యువత ఉద్యోగ అవకాశాలు..**

**మంత్రి వివేక్‌కు ఘన సన్మానం..**

**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని యువతి యువకులకు ప్రధానంగా దళిత యువతకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం గొప్ప వరమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అన్నారు చాలామంది యువతి యువకులకు కలగానే మిగిలిన విదేశాలలో ఉద్యోగ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి చొరవ తీసుకొని యువతి యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల మంత్రి వివేక్ కి కృతజ్ఞతలు తెలిపారు సచివాలయంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య రాష్ట్ర అధ్యక్షులు కడారం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు ల నేతృత్వంలో మంత్రిని ఘనంగా సన్మానించారు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిన యువతకు రాష్ట్ర ప్రభుత్వము ప్రధానంగా మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చూపుతున్న చొరవ మర్చి పోలేనిది అన్నారు మరింత మంది దళిత యువతీ యువ కులకు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కడారం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస రాజేష్, సీనియర్ నాయకులు పానుగంటి రాజలింగం అక్కపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### మూడేళ్లయినా ముందుకురాలే..

**తమ్మి చెరువు సుందరీకరణ పూర్తి చేయలే : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, అక్టోబర్ 18, (జనంసాక్షి):** మూడేళ్లయినా తమ్మి చెరువు సుందరీకరణ పూర్తి చేయలే..! అని మంథని మాజీ ఎమె మ్మెల్యే పుట్ట మధుకర్ విమర్శించారు. పట్టణంలోని తమ్మిచెరువును సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక ఏండ్లుగా మన పూర్వీకుల కాలం నుంచి తమ్మి చెరువులో బతుకమ్మలను ఆంపే ఆనవాయితీ ఉండేదని తెలిపారు. ఈ చెరువును ఆనాడు తాము సుందరీకరణ చేశామని, అయితే పనులు ఎక్కడైతే ఆగిపోయాయోమూడేళ్లు అయినా పనులు అక్కడే ఉన్నాయని, సారుకు మంత్రి పదవి వచ్చినా తట్టెడు మట్టి పోయలేదని ఎద్దేవా చేశారు. తాము ఏనాడు ఓట్ల కోసం రాజకీయం కోసం మాట్లాడమని తమ మాటలకు తమ్మిచెరువు నిలువెత్తు సాక్ష్యమని చెప్పారు. ఆనాడు తమ్మి చెరువును అద్భుతంగా తీర్చిదిద్ది బోటింగ్, స్నాక్స్ పాయింట్, రింగ్‌రోడ్‌ను ప్రతిపాదన చేశామని, 70 శాతం పనులు పూర్తి కాగా ప్రభుత్వం మారిపోవడంతో అక్కడే ఆగిపోయాయని , మూడేళ్లయినా ముందుకు సాగలేదని విమర్శించారు. ఈనాడు కమీషన్‌ల కోసం రోడ్లు చేస్తున్నారని, ఈ చెరువు పనులకు కమీషన్‌లు ముట్టకపోవడంతోనే పనులు చేస్తలేరని బావిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ కమీషన్‌లు ముట్టితే ఎన్నికలకు ముందు చేస్తారు కావచ్చని అన్నారు. తమ్మిచెరువుకు ఒక ప్రత్యేక ఉందని, అనేక జీవరాశులు ఇక్కడే ఉంటాయని, సాయంకాలం అనేక మంది సేద తీరుతూ ప్రకృతిని తిలకిస్తుంటారని, అలాంటి వారికి నిరాశే మిగిలిందన్నారు. ఓట్లప్పుడే పనులు చేస్తమనుకోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఏదో పెద్దస్థాయిలో ఉన్నారని మంచిగా అభివృద్ధి చేస్తరనే మున్సిపాలిటిని పెద్ద మెజార్టీతో అప్పజెప్తే పాలకవర్గం కూడా ఏమీ చేయడంలేదని,ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరిచి మంథని ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## పసిప్రాణాలతో చెలగాటం

**చిన్నారుల చేతిలో బైక్.. రోడ్లపై విచ్చలవిడిగా ప్రయాణాలు!**

- ఒక బండిపై నలుగురు.. రోడ్లపై ఇష్టారాజ్యం!
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?
- తల్లిదండ్రులదా.. ప్రోత్సహిస్తున్న సమాజానిదా?



**సిరికొండ అక్టోబర్ 18 (జనంసాక్షి):** పిల్లల భవిష్యత్తు బంగారంలా ఉండాలని కోరుకునే తల్లిదండ్రులే.. అదే పిల్లల చేతికి చిన్న వయసులోనే మోటార్ సైకిళ్లు ఇచ్చి వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసం? వాహనం నడిపే వయసు రాకముందే బైక్‌లు చేతికి అందిస్తే, బాధ్యతాయుతమైన డ్రైవర్లుగా కాకుండా నిర్లక్ష్యపు ప్రయాణికులుగా మారితే అందుకు బాధ్యత ఎవరిది?ఒక బైక్‌పై ఇద్దరు ప్రయాణించడమే నిబంధనలకు లోబడి ఉండాల్సిన విషయం కాగా, కొందరు యువకులు ఒకే బండిపై ముగ్గురు, నలుగురు ప్రయాణిస్తూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. వేగానికి హద్దులు లేకుండా, భద్రతపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతూ తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు.

**పండుగ వేళ మరింత అప్రమత్తత అవసరం!**

ప్రస్తుతం పండుగల సందడి మొదలైంది. ప్రజలు పూజలు, కొనుగోళ్లు, ఇతర పనుల కోసం రోడ్లపై రద్దీగా తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో మైనర్లు, యువకులు విచ్చలవిడిగా బైక్‌లు నడిపితే చిన్న పొరపాటు కూడా పెను ప్రమాదానికి దారితీయవచ్చు. ఒక క్షణం నిర్లక్ష్యం.. ఎన్నో కుటుంబాల్లో జీవితకాలపు విషాదాన్ని నింపవచ్చు.ఇటువంటి ఘటనలు జరగవద్దని ఎన్నిసార్లు చెప్పినా కొందరిలో మార్పు రావడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదం జరిగాక కన్నీళ్లు పెట్టుకోవడం, ఆసుపత్రుల చుట్టూ తిరగడం, కుటుంబ సభ్యులను కోల్పోయాక బాధపడటం కంటే.. ప్రమాదం జరగకముందే జాగ్రత్త పడటం ముఖ్యం కాదా? తల్లిదండ్రులారా.. మీ పిల్లలపై ప్రేమ ఉంటే బాధ్యత కూడా ఉండాలి! పిల్లలు బైక్ అడిగారని కొనివ్వడం, స్నేహితుల ముందు గొప్పగా కనిపించాలనే ఉద్దేశంతో వాహనాలు అప్పగించడం ప్రేమ కాదు.. వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టే చర్య కావచ్చు. పిల్లలకు ఏది అవసరమో, ఏది ప్రమాదకరమో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సరైన వయసు, చట్టబద్ధమైన డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన వచ్చే వరకు వాహనం నడపనివ్వకూడదు.ప్రశ్నించాల్సింది పిల్లలను మాత్రమే కాదు.. వారిని ప్రోత్సహిస్తున్న పెద్దలను కూడా!మైనర్లు బైక్‌లు నడుపుతుంటే చూసి మురిసిపోవాలా? ఒకే బండిపై నలుగురు వెళ్తుంటే సరదాగా చూడాలా? లేక వారి ప్రాణాలకు ముప్పు ఉందని హెచ్చరించాలా? తప్పును చూసి కూడా ప్రశ్నించకుండా మౌనంగా ఉండే సమాజం తన బాధ్యతను విస్మరిస్తున్నట్లే కాదా? ప్రమాదం జరిగినప్పుడు బాధ్యులను ప్రశ్నించే ముందు, ప్రమాదానికి దారితీసే నిర్లక్ష్యాన్ని మొదట్లోనే అడ్డుకోవాలి. తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు, యువత, పోలీసులు సమన్వయంతో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.బైక్ ఇవ్వడం గొప్ప కాదు.. బిడ్డను క్షేమంగా పెంచడం గొప్ప! వేగం చూపించి హీరో అనిపించుకోవడం కాదు.. క్షేమంగా ఇంటికి చేరడమే నిజమైన విజయం! పండుగ ఆనందాలు ప్రమాదాలుగా మారకూడదు. ఏ తల్లి తన బిడ్డ కోసం కన్నీరు పెట్టకూడదు. ఏ కుటుంబం తమ నిర్లక్ష్యానికి జీవితాంతం మూల్యం చెల్లించకూడదు. అందుకే తల్లిదండ్రులారా.. మీ పిల్లల చేతికి బైక్ ఇచ్చే ముందు ఒక్కసారి ఆలోచించాలని మనవి.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 19 అక్టోబర్ 2026

# తెలంగాణ భవితవ్యాన్ని మార్చనున్న పట్టభద్రుల ఎన్నికలు

- ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి



ఖైరతాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి) : మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు తెలంగాణ భవితవ్యాన్ని మార్చే ఎన్నికలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంఆర్‌జీ) అన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని గాంధీపుర బస్తీలో ఆయన పట్టభద్రులకు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో చేసిన విధ్వంసానికి రానున్న పట్టభద్రుల ఎన్నికలు రిఫరెండంగా మారనున్నాయని పేర్కొన్నారు. మేధావులు, యువత, సమాజంపై అవగాహన కలిగిన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి రాజకీయ దెబ్బ పట్టభద్రుల నుంచే తగలనుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు రామ్ చందర్, సారంగపాణి, సాయిబాబా, శ్రావణి, మనీషా, హరిప్రియ, అన్వర్, కార్తిక్, అమూల్య, రజిని, నరసింహ, దన్ను, శశి తదితరులు పాల్గొన్నారు.

# రోహిత్ రెడ్డి పేరుతో నకిలీ షోకాజ్ నోటీసు ప్రచారం

- సోషల్ మీడియాలో వైరల్ అయిన పత్రంపై సమగ్ర విచారణకు బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- పార్టీ లెటర్‌హెడ్, లోగోతో నోటీసు ప్రచారం చేసిన వారిని గుర్తించాలని విజ్ఞప్తి




పెద్దేముల్, అక్టోబర్ 18 (జనంసాక్షి): తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పేరుతో సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన బీఆర్ఎస్ షోకాజ్ నోటీసు వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నోటీసు అసలైనదా, లేక నకిలీదా అన్న విషయంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 17న పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక లెటర్‌హెడ్, లోగోతో కూడిన పత్రాన్ని 'తాండూర్ గుస గుస' అనే సోషల్ మీడియా ఛానల్‌లో ప్రచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ అధికారికంగా పైలట్ రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసిందా లేదా అనే అంశాన్ని నిర్ధారించాలని పోలీసులను కోరారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వివాదాస్పద పత్రం పార్టీ అధికారికంగా జారీ చేసినదా, లేక ఎవరైనా నకిలీ పత్రాన్ని రూపొందించి ప్రచారం చేశారా అనే కోణంలో విచారణ జరపాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. పత్రాన్ని రూపొందించినవారు, ప్రచారం చేసినవారి వివరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ యాదవ్, స్థానిక సర్పంచ్ డీవై నర్సింహులు, ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు డీవై ప్రసాద్ బాబు, సీనియర్ నాయకులు తోపాజి, రమేశ్, జనార్దన్ రెడ్డి, తలారి వీరప్ప, గోపాల్ రెడ్డి, మన్‌సాన్‌పల్లి రవి నాయక్, జయరాం, జ్ఞానేశ్వర్, వెంకటేశ్ చారి, యాదయ్య, నర్సింహులు, మలేశం,డీలర్ విజయ్,ఈశ్వర్,తదితరులు పాల్గొన్నారు.



## జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మనీషాకు సత్కారం

శంకర్‌పల్లి, అక్టోబర్ 18 (జనం సాక్షి): జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మనీషా అనంత్ రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ఆదివారం మహాలింగాపురంలోని ఆమె నివాసంలో శాలువాతో సత్కరించి, భగవద్గీతను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనీషా విజయం మహిళలకు, యువతకు ఆదర్శమని, న్యాయవ్యవస్థలో ఉన్నత స్థాయికి ఎదిగి బడుగు బలహీన వర్గాలకు న్యాయం అందించాలని ఆకాంక్షించారు. మనీషా కృతజ్ఞతలు తెలుపుతూ రాజ్యాంగబద్ధంగా నిష్పక్షపాత న్యాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బౌరంపేట రామ్మోహన్ రెడ్డి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## కోరుట్లలో అంగరంగ వైభవంగా బతుకమ్మ పండుగ వేడుకలు




జగిత్యాల జిల్లా క్రైమ్, అక్టోబర్ 18 (జనంసాక్షి): జిల్లాలోని కోరుట్ల పట్టణంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. కోరుట్ల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం, డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహం సమీపంలో పలు వీధుల గుండా మహిళలు చిన్నారులు బతుకమ్మలను రకరకాల పూలతో పేర్చి బతుకమ్మ పాటలు ఆడుతూ పాడుతూ నృత్యాలు చేస్తూ సామూహికంగా వేడుకలు నిర్వహించారు. చిన్నారులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ సామూహికంగా ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ వేడుకల్లో సీఐ కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో కోరుట్ల కథలాపూర్ ఎస్సైలు శ్యామ్ రాజ్, రవి కిరణ్ కుమార్ బందోబస్తును ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో త్రాగునీటిని పలు కూడలిలో ఏర్పాటు చేశారు. బతుకమ్మ వేడుకలు వాగు వద్ద ఆడపడుచులు గౌరమ్మ వేడుకలను తిరక్క పూలతో అలంకరించి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. రామ రామ ఉయ్యాలో, చిత్తు చిత్తుల బొమ్మ... పలు ఆటలతో వైభవంగా పట్టణంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## నీటి పొదుపుతోనే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోగలం

మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్



శంకర్ పల్లి, అక్టోబర్ 18(జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ సూచించారు. శ్రీశైలం, సింగూరు జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి సరఫరా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావించి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.ఇంటి ముందు నీటిని వృథాగా పోయడం, వాహనాలను అనవసరంగా కడగడం, పబ్లిక్ నల్లాల వద్ద నీటిని వృథా చేయడం మానుకోవాలని సూచించారు. కుళాయిలను వెంటనే మూసివేయడంతో పాటు పైపుల లీకేజీలను అరికట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. నీటిని ఆదా చేయడంతో పాటు విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించాలని, అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, టీవీలు, విద్యుత్ దీపాలను ఆర్పివేసి పగటిపూట సహజ కాంతిని వినియోగించుకోవాలని చైర్మన్ సూచించారు.

## కోట్‌పల్లి నూతన ఎస్ఐగా మీనాక్షి

కోట్‌పల్లి, అక్టోబర్ 18 (జనంసాక్షి): కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా మీనాక్షి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శైలజ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయ్యారు. కోట్‌పల్లిలో విధులు నిర్వహించిన కాలంలో శైలజ శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు పోలీసు సేవలు అందించేందుకు కృషి చేశారు. పోలీస్ శాఖ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సేవలను అందించారు. తాజాగా ఆమె బదిలీ కావడంతో, ఆమె స్థానంలో మీనాక్షి బాధ్యతలు చేపట్టారు.

## ఇంటి భద్రత నుంచి సైబర్ నేరాల వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి




చేవెళ్ల, అక్టోబర్ 18 (జనంసాక్షి): ప్రజలు ఇంటి భద్రతతో పాటు దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల సీఐ కట్టా నరేందర్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజల భద్రతపై ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బంగారం, నగదు వంటి విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు అవి నిరంతరం పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. పొరుగువారితో సత్సంబంధాలు కలిగి ఉండటం ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, కదలికలను సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఇంట్లో ఎవరూ లేని విషయాలు, ప్రయాణాలకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్, గ్యాస్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇంటి ప్రధాన ద్వారాలు, కిటికీలు, తాళాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ప్రజలు తమ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సీఐ నరేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలు

ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

ఎల్బీనగర్, జనవరి 18 (జనం సాక్షి) వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ డీర్ పార్క్ సమీపంలో కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. వంశీ, ఆయన భార్య వాణి, ఇద్దరు కుమారులు మన్విష్, యుగ్విష్ బంధువుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని తొలుత శ్రేయాస్ ఆసుపత్రికి, అనంతరం కామినేని ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

## 70వ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) అండర్ 17 పోటీలలో రంగు సాయి మనీష్ గౌడ్ కు రజిత పతకం



శామీర్‌పేట, అక్టోబర్ 18 (జనం సాక్షి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్ఐ) ఆధ్వర్యం లో సంగారెడ్డి జిల్లా పటాన్ చెర్వు పట్టణంలో మైత్రి గ్రౌండ్ లో నిర్వహించిన 70వ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) అండర్ 17 పోటీలలో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఉద్దెమర్రికి చెందిన రంగు నవీన్ గౌడ్, విజయ దంపతుల కుమారుడు రంగు సాయి మనీష్ గౌడ్ రజిత పతకం సాధించాడు. ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న సాయి మనీష్ గౌడ్ కోచ్ శ్రీధర్ శిక్షణ లో కఠినమైన క్రీడ అయినటువంటి రెజ్లింగ్ పోటీలో రాణిస్తూ, తన ప్రతిభ చాటుతున్నాడు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా సాయి మనీష్ గౌడ్ రజిత పతకం అందుకున్నాడు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీలో అండర్ 17 విభాగంలో 48 కేజీ పరిమితిలో రజిత పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. కోచ్ శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని రజిత పతకం సాధించేలా కృషి చేసినందుకు సాయి మనీష్ గౌడ్ కోచ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రజిత పతకం సాధించిన సాయి మనీష్ గౌడ్ ను పలువురు ప్రశంశించారు. అంచలంచలుగా రానిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

# సాంస్కృతి, సైబర్ అవగాహనల అద్భుత సమ్మేళనం




శేరిలింగంపల్లి,అక్టోబర్18 (జనంసాక్షి) : ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీస్-ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన "సైబర్ దాండియా" కార్యక్రమం ఘన విజయం సాధించింది. సాంస్కృతిక వేడుకలను అత్యంత ముఖ్యమైన సైబర్ భద్రత సందేశాలతో మేళవిస్తూ చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కమిషనర్లు రమేష్, సృజన పేర్కొన్నారు. సుమారు 1500 మంది (ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఐటీ నిపుణులు, యువత, మహిళలు మరియు కుటుంబ సభ్యులు నిర్వాహకులు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా.ప్రముఖుల ఆధ్వర్యంలో దాండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సాంస్కృతిక వేడుకల ద్వారా సైబర్ భద్రత సందేశాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతోనే "సైబర్ దాండియా" నిర్వహించినట్లు సీపీ రమేష్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పోలీసులు ప్రజలతో నేరుగా మమేకమై కొత్త ముప్పుల పట్ల అప్రమత్తం చేయవచ్చని వారు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో టెక్నాలజీ జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు పాల్పడుతున్నారని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ మోసాలు ఫిషింగ్, స్మిషింగ్ మరియు ఓటీపీ మోసాలు ఫేక్ లింకులు మరియు పార్ట్‌టైమ్ జాబ్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డీసీపీ పుష్ప హెచ్చరికలు - పాటించాల్సిన సూత్రాలు

సైబర్ నేరగాళ్లు ప్రజల్లోని భయం, అత్యాశ, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని క్రైమ్స్ డీసీపీ పుష్ప తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల కాల్స్, వీడియో కాల్స్, అనుమానాస్పద ఏపీకే ఫైల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. క్లిక్ చేసే ముందు ఆలోచించండి నమ్మే ముందు ధృవీకరించండి అనే బంగారు సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టూల్స్ ద్వారా అవగాహన**

ఈ కార్యక్రమంలో కేవలం సాంస్కృతిక ప్రదర్శనలే కాకుండా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ టూల్స్, వీడియోలు మరియు ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్లను ఉపయోగించారు. నేరగాళ్ల మోసాల సరళిని (మోడస్ ఆపరేంది) ప్రజలకు ఎంతో ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. బాధితులు చేయవలసిన పని ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సురక్షితంగా సంబరాలు జరుపుకోండి - సైబర్ ప్రపంచంలో సురక్షితంగా ఉండండి" అనే సందేశంతో ఈ సైబర్ దాండియా వేడుకలు ముగిశాయి.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అన్నపూర్ణ డిసిపి అడ్మిన్, డీసీపీ సైబర్ క్రైమ్స్ పుష్ప; డీసీపీ లావణ్య; కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్; ట్రాఫిక్-2 డీసీపీ ఎస్. శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్; శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్, ఐపీఎస్; కార్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ పి. సంజీవ్ తదితర ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు వెలుగు పత్రిక క్షమాపణ చెప్పాల్సిందే

- వివాదాస్పద కథనాన్ని 24 గంటల్లో ఉపసంహరించుకోవాలి
- ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం డిమాండ్

లండన్, అక్టోబర్ 18 (జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా 'కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ' పేరుతో ప్రచురించిన కథనాన్ని వీ6 వెలుగు పత్రిక వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం డిమాండ్ చేశారు. లండన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఉపాధ్యక్షుడు రవి రేతినేని, కార్యదర్శి రవి ప్రదీప్ పులుసుతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే వెలుగు పత్రిక రాజకీయ దురుద్దేశంతో కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా కేసీఆర్‌పై అసత్య ప్రచారానికి దిగడం పాత్రికేయ విలువలకు విరుద్ధమన్నారు. మేడిగడ్డ వద్ద నీరున్నా రైతులకు సాగునీరు అందించని ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. వివాదాస్పద కథనంపై ఇప్పటికే బీఆర్ఎస్ న్యాయ విభాగం పత్రిక యాజమాన్యానికి నోటీసులు జారీ చేసిందని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ కాలువలను కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంతో ముడిపెడుతూ చేసిన ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలని రవి రేతినేని సవాల్ విసిరారు. 24 గంటల్లో కథనాన్ని ఉపసంహరించుకుని మొదటి పేజీలో క్షమాపణ ప్రచురించాలని రవి ప్రదీప్ పులుసు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఎన్నారైలను ఏకం చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్

ఖైరతాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి) : సేవా భయ సేవా సంఘ్ నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆల్ సెల్ కో-కన్వీనర్ అట్లూరి రామకృష్ణ, సభావత్ కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ప్రార్థించారు. సమాజంలో మానవత్వం, ధర్మం, లోకక్షేమం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. భారతదేశం శాంతి, సౌభ్రాతృత్వం, సమైక్యతతో ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని, దేశ ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని కోరుకున్నారు. తెలుగు నేల సుభిక్షంగా ఉండాలని, దేశ కీర్తి దశదిశలా వ్యాపించాలని, ధర్మం జయించి శాంతి వర్ధిల్లాలని ప్రార్థించారు. కమిటీ సభ్యులు పి.చరణ్ సింగ్, కునాల్ రాథోడ్, సురేష్ రాథోడ్, విక్కీ జాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## బతుకమ్మ స్ఫూర్తితో కార్మిక ఐక్యతను బలోపేతం చేయాలి

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 18 (జనంసాక్షి) : బతుకమ్మ పండుగ స్ఫూర్తితో శ్రామిక వర్గ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, కార్మిక హక్కుల పరిరక్షణ, సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జె. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, కార్మిక వర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తంగేడు, గునుగు తదితర రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతుందని పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం వంటి సందేశాలను ఈ పండుగ అందిస్తుందని తెలిపారు. మరోవైపు ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి కొరత, కార్మిక హక్కులపై దాడులతో శ్రామిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కష్టాలను ఎదుర్కొంటూ పోరాడే స్ఫూర్తి తెలంగాణ కార్మికులు, మహిళలకు ఉందని పేర్కొన్నారు.

కార్మిక కుటుంబాలు, పేద ప్రజల జీవితాల్లో బతుకమ్మ, దసరా పండుగలు సంతోషాలను నింపాలని చంద్రశేఖర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి, అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి జిల్లా సహాయ కార్యదర్శి కె.ఉన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌లో గుంతలమయంగా రహదారులు!

- ప్రజలకు తప్పని తిప్పలు.. ప్రమాదాల ముప్పు
- అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్




హయత్ నగర్, అక్టోబర్ 18 (జనం సాక్షి) : ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారులపై గుంతలు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల దుస్థితితో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు గుంతల కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

**ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి**

ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని స్థానికులు అంటున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం సంబంధిత అధికారుల బాధ్యతని పేర్కొంటున్నారు.

**నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలి**

రహదారుల దుస్థితిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గుంతలు ఏర్పడటానికి గల కారణాలను గుర్తించి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి, నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరమ్మతుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచిస్తున్నారు.

**ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై జవాబుదారీతనం కోరుతామని చెబుతున్నారు. ప్రజలకు సురక్షితమైన రహదారులు కల్పించడం అధికారుల బాధ్యతని, గుంతల సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోలేక ఆత్మహత్య

**అంబర్పేట్ అక్టోబర్ 18 (జనం సాక్షి) :** అంబర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైస్వాల్ గార్డెన్, అంబర్పేట్‌లో విషాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుద్ధ గోనివర్ విజయ్ గౌడ్(37) భార్య కుమారునితో అంబర్పేట్ లో నివసిస్తున్నాడు. దసరా పండుగ కు మూడు రోజుల క్రితం భార్య కుమారుడు కరీంనగర్‌లోని స్వగ్రామానికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని సంఘటన జరిగిన రోజు విజయ్ గౌడ్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడంతో అతని భార్య సమీప బంధువైన విజయ్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చింది. సమాచారం మేరకు అతను ఇంటికి వెళ్లి చూడగా బెడ్ రూమ్ లోని వెంటిలేటర్ గ్రిల్స్ కి తెల్లని చున్నీతో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడు. వెంటనే పోలీస్‌కు సమాచారం అందించాడు. పోలీసులు, క్లూ టీం అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు అప్పటికే అతను మృతి చెందినట్లు అంబులెన్స్ డాక్టర్ నిర్ధారించాడు. గత మూడు నెలల నుండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని, ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేశారు. మృతిపై ఎవరికి అనుమానం లేదని తెలిపారు చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం స్టేషన్ హౌస్ ఆఫీసర్ టి. కిరణ్ కుమార్ తెలిపారు.

## ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**రుద్రంగి అక్టోబర్ 18( జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రానికి చెందిన వంకాయల లక్ష్మణ్ ఉదయం నాగారం చెరువు అటవీ ప్రాంతంలో బతుకమ్మ పువ్వు కోసం వెళ్లగా ఎలుగుబంటి ఒకసారిగా లక్ష్మణ్‌పై దాడి చేసింది. దీంతో వంకాయల లక్ష్మణ్ తలపై, చేతుపై తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి వాకింగ్

- గోదావరిఖని ఏసీపీ మడత రమేష్
- ఉత్సాహంగా సాగిన 17 కిలోమీటర్ల వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమం



**గోదావరిఖని/రామగిరి, జనంసాక్షి:** జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు నిర్వహించిన మన జిల్లా – మన రామగిరి కార్యక్రమంలో భాగంగా రామగిరి ఖిల్లా వద్ద నిర్వహించిన వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగిందని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి ఖిల్లా విశిష్టతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలతో ప్రత్యేకత కలిగిన రామగిరి ఖిల్లా పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. యువత, ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రామగిరి ఖిల్లాపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు, చారిత్రక వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 నుంచి 150 మంది వాకర్స్, ట్రెక్కర్స్ ఉత్సాహంగా పాల్గొని, జోష్‌తో సుమారు 17 కిలోమీటర్ల మేర వాకింగ్, ట్రెక్కింగ్ పూర్తి చేశారు. పాల్గొన్న వారిలో కనిపించిన ఉత్సాహం, ప్రకృతి పట్ల ఆసక్తి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. ట్రెక్కింగ్ అనంతరం నిర్వాహకులు మహిపాల్ రెడ్డి ట్రెక్కింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు మెడల్స్ ప్రధానం చేశారు మెడల్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, నిర్వాహకులు మైపాల్ రెడ్డి, సెక్షన్ పర్యవేక్షకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- చిగురుమామిడిలో దుర్గమాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం



**చిగురుమామిడి అక్టోబర్ 18(జనంసాక్షి):** మండలంలోని కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని దుర్గామాత వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ తో కలిసిప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటే కేవలం పూల పండుగ కాదు,ఇది మన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని,తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు,మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ అని అన్నారు. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను ఆడి పాడుతారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ” అని అన్నారు. దీపావళి పండుగ నాటికి మండలంలోని ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు మంజూరు చేస్తానని,గ్రామాల్లో రాత్రి వేళల్లో చీకటి ఉండకుండా, ప్రజల భద్రత కోసం,పండుగ వెలుగుల కోసం ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి



**పెద్ద శంకరంపేట్ అక్టోబర్ 18 (జనం సాక్షి) :** చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద శంకరంపేటలో చోటుచేసుకుంది. పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద శంకరంపేట చెందిన ఔడగిరి బేతయ్య (38) గురువారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ఎక్కడైనా ఉన్నారేమో వెతకడం జరిగిందన్నారు. పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని దయ్యాలకుంటలో చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగిపోయి మృతి చెందడంతో ఆదివారం ఉదయం నీటిపై తేలినాడు అని వివరించారు. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయి వచ్చేదినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## సచివాలయంలో మంత్రి వాకిటి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ అక్టోబర్ 18 (జనం సాక్షి) :** దసరా, సద్దుల బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని మంత్రి వాకిటి శ్రీహరి సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పాటు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ, దసరా పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## డీ8 కెనాల్‌లో మోటార్ చోరీల పరంపర - రైతుల ఆవేదన

- వారం రోజుల వ్యవధిలో రెండు మోటార్ల చోరీ స్థానిక రైతుల్లో ఆందోళన
- రైతు మల్లేష్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**రేవల్లి, అక్టోబర్ 18 (జనంసాక్షి) :** మండలంలోని తల్పునూర్ గ్రామ శివారు తాండ రోడ్డులోని ఎంజీ కేఎల్ఐ డీ8 కెనాల్ లో మరోసారి కెనాల్ మోటార్ చోరీ జరిగింది. శనివారం రాత్రి గ్రామానికి చెందిన రైతు వట్టెం మల్లేష్ కు చెందిన కెనాల్ మోటార్ ను గుర్తు తెలియని దుండగులు వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. డీ8 కెనాల్‌లో తరచూ మోటారు, స్టార్టర్ బాక్సుల చోరీలు:డీ8 కెనాల్ పరిధిలో ఇది ఒక్కటే కాదు, గత కొన్ని నెలలుగా వరుసగా కెనాల్ మోటార్లు, స్టార్టర్ బాక్సులు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పొలాలకు నీరు పెట్టేందుకు అమర్చుకున్న మోటార్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ఖరీదు రూ. 30 వేల నుండి 50 వేల వరకు ఉంటుండగా, స్టార్టర్ బాక్సులు కూడా ఎత్తుకెళ్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత వారం రోజుల క్రితం రేవల్లి ప్రధాన దారిలో గల ఓ రైతుకు చెందిన మోటర్, మరో రైతు స్టార్టర్ బాక్స్ దొంగిలించిన విషయం మరవక ముందే మరోసారి మోటర్ ఇలా దొంగిలించబడడం స్థానికంగా రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. డీ8 కెనాల్ వెంట పోలీసులు నిఘా పెంచి, రాత్రి గస్తీ ఏర్పాటు చేసి చోరీలకు అడ్డుకట్ట వేయాలని, దొంగలను పట్టుకుని తమ మోటార్లను తిరిగి ఇప్పించాలని తల్పునూర్, తండా రైతులు కోరుతున్నారు.

## బతుకమ్మ, దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**మహిళల భద్రతకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు : డీసీపీ భూక్య రాంరెడ్డి**

**పెద్దపల్లి,(జనంసాక్షి) :** బతుకమ్మ,దసరా పండుగలను ప్రజలందరూ సంతోషంగా,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి సూచించారు. పండుగ సందర్భంగా మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ముందస్తు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ సంబరాల సమయంలో మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బందులు కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా మహిళలు చైన్ స్నాచింగ్ వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## కులం పేరుతో దూషించి దాడి.. కఠినచర్యలు తీసుకోవాలి

**ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్, ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18(జనంసాక్షి) :** నాగిరెడ్డిపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బంధముల నరేష్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంటోళ్ల యాదయ్య, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తొంట సాయిలు, మండల ఉపాధ్యక్షులు యాదగిరి, నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు హత్యాయత్నం కేసు కూడా నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు గ్రామాల్లో అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయని, పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలపాలైన బంధముల నరేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయనకు ఎమ్మార్పీఎస్ పూర్తిగా అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. దళితులపై దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# బతుకమ్మ నిమజ్జనానికి నీటి కరువు

- ఎల్‌నినో ప్రభావంతో ఎండిన వాగులు, వంకలు
- పామెన 8వ వార్డులో కృత్రిమ కొలను ఏర్పాటు



**చేవెళ్ల, అక్టోబర్ 18 (జనంసాక్షి)** ప్రకృతిలో విరబూసిన తంగేడు పూలతో అందంగా అలంకరించి, తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు నీళ్లు కరువయ్యాయి. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువలు ఎండిపోవడంతో నిమజ్జనానికి నీటి కొరత ఏర్పడింది. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామెన 8వ వార్డులో ఏటా నీటితో కళకళలాడే వాగు ఈసారి పూర్తిగా ఎండిపోయింది. దీంతో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు నీరు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకున్న వార్డు కౌన్సిలర్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి ఆదివారం జేసీబీ సహాయంతో కృత్రిమ కొలను ఏర్పాటు పనులను ప్రారంభించారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. సాధారణంగా ఈ సమయానికి నీటితో నిండుగా ఉండే కుంటలు, కాలువలు సైతం ఎండిపోవడం ఆందోళన కలిగిస్తోంది. బతుకమ్మ నిమజ్జనానికే నీరు దొరకని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు రానున్న రోజుల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

## అమ్మవారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రుద్రంగి అక్టోబర్ 18 (జనం సాక్షి) :** రుద్రంగి మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆయా మండపాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండా లని, గ్రామాలు అభివృద్ధి చెందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

# రైతు శాంతన్నకు నిరంజన్ రెడ్డి అభినందనలు

- దసరా, దీపావళి పండుగలకు బంతిపూల సాగుతో రైతులకు ప్రయోజనం
- శాంతన్న సాగు చేసిన పూలకు స్వయంగా ఆర్డర్ ఇచ్చిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 18, జనంసాక్షి :** స్థానికంగా బంతిపూల సాగు చేపట్టి, సమృద్ధిగా పూల దిగుబడి సాధిస్తున్న రైతు శాంతన్నను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. వనపర్తి పట్టణంలోని మర్రికుంటలో శాంతన్న సాగు చేసిన బంతిపూల తోటను ఆదివారం ఆయన సందర్శించి, సాగు విధానాన్ని పరిశీలించారు. తోటలో ఏపుగా పెరిగి, పూలతో కళకళలాడుతున్న బంతి మొక్కలను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు కాలానుగుణంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో బంతిపూలకు అధిక డిమాండ్ ఉంటుందని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పూలను దిగుమతి చేసుకోవడం కంటే స్థానిక రైతులు పండించిన పూలు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, స్థానిక రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మార్కెట్ అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. స్థానిక రైతులు పండించిన పంటలకు ప్రజలు, వ్యాపారులు ప్రాధాన్యతనిస్తూ వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఇందులో భాగంగా రైతు శాంతన్న సాగు చేసిన బంతిపూలకు దసరా, దీపావళి పండుగల కోసం తాను స్వయంగా ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి వెంట వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, మాధవరెడ్డి, సునీల్ వాల్మీకి, మంద రాము, ఎండీ అలీం, ముద్ద సిర్, జమీల్, చీర్ల శ్రీనివాసులు, బెదారి కుమార్, శంకర్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కరువుపై అధ్యయనమే ప్రజాయాత్ర లక్ష్యం

**రైతులకు భరోసా కల్పిస్తాం: హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ**



**పెద్దపల్లి,అక్టోబర్ 18(జనంసాక్షి) :** రైతులకు భరోసా కల్పిస్తూ కరువు పరిస్థితులపై అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి నివేదించడమే ప్రజాయాత్ర లక్ష్యమని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్,హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ తెలిపారు. పెద్దపల్లి కమాన్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ వరకు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోయారని, రానున్న రోజుల్లో కరువు తీవ్రత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి వరికి బదులు కంది,మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కళాకారుల బృందాలతో ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. అసైన్డ్ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, మూడేళ్లుగా నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో అసైన్డ్ భూముల సమస్య కొనసాగుతోందని,సుద్దాల గ్రామంలో విద్యుత్తు లేక రైతులు డీజిల్ ఇంజిన్లతో సాగు చేస్తున్నారని తెలిపారు. ఎదులాపురంలో వరి పంటలు ఎండిపోవడాన్ని గుర్తించామన్నారు. ఎస్ఐఆర్ తో ఓటు హక్కు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దేశవ్యాప్త కులగణనలో బీసీ పదం చేర్చడం, విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సిబ్బంది,కళాకారులు గుగ్గిళ్ల ఎల్లన్న,కడారి శ్రీనివాస్,మేడ స్వామి,యాకుబ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి స్పీకర్ మానవతా సహాయం

**బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఎల్వోసీ అందజేత**



**వికారాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి) :** వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామ ఉప సర్పంచ్ అమృతమ్మ, సత్తయ్య దంపతుల కుమారుడు కంపల్లి ప్రశాంత్ కుమార్ కు తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ రూ. 2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఈ నెల 10 శనివారం రోజున కొత్తగాడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రశాంత్ కుమార్ తీవ్రంగా గాయపడి, హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ చలించిపోయారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకొని, మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్వోసీ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నా నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా నేను అండగా ఉంటాను. ప్రశాంత్ కుమార్ కు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులను కోరాను. అతని కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది అని ఆకాంక్షించారు.

**ప్రశాంత్ కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

తమ కుమారుడు ప్రశాంత్ కు అత్యవసర సమయంలో ఆదుకుని, రూ. 2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్వెల్లి గ్రామ ఉప సర్పంచ్ అమృతమ్మ , సత్తయ్య దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాయమాటలతో డబ్బులు కాజేసిన దొంగ

- మూడు గంటల్లోనే పట్టుకున్న కోహెడ పోలీసులు
- 28 వేల నగదు స్వాధీనం..పోలీసులకు గ్రామస్తుల అభినందనలు




**కోహెడ అక్టోబర్ 18 (జనంసాక్షి ):** మండలంలోని నాగసముద్రాల గ్రామంలో గ్యాస్ కనెక్షన్ ఉచితంగా మంజూరైందని నమ్మించి ఓ మహిళను మోసం చేసి నగదు కాజేసిన వ్యక్తిని ఆదివారం కోహెడ పోలీసులు కేవలం మూడు గంటల్లోనే పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.28 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కోహెడ ఎస్సై అభిలాష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసముద్రాల గ్రామానికి చెందిన కడారి లచ్చవ్వ ఇంటికి శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఓ వ్యక్తి వచ్చాడు. మీ కుమారుడు రామచంద్రం పేరుపై ఉచిత గ్యాస్ కనెక్షన్ మంజూరైందని, అందుకోసం రూ.2,500 చెల్లించాలని నమ్మించి ఆమె నుంచి డబ్బులు తీసుకున్నాడు. అనంతరం ఇంట్లో ఉన్న గ్యాస్ కనెక్షన్‌ను అధికారులు తనిఖీ చేస్తారని, ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తారని మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో ఇంట్లోని బొడ్ల సంచిలో సుమారు రూ.27 వేల నగదు ఉందని గమనించిన నిందితుడు, ఆ సంచిని ఇంట్లో ఉన్న పీటపై పెట్టగానే దానిని తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కోహెడ పోలీసులు ప్రత్యేక బృందం (ఐడి పార్టీ) సహకారంతో రంగంలోకి దిగి, మూడు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.28 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. త్వరితగతిన స్పందించి నిందితుడిని పట్టుకున్న కోహెడ పోలీసులకు నాగసముద్రాల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఎస్సై అభిలాష్**

ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ప్రభుత్వ పథకాల పేరుతో ఇంటికి వచ్చే గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని, ఇంట్లో నగదు, విలువైన వస్తువులు ఉన్న వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్సై అభిలాష్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై అభిలాష్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
19 అక్టోబర్ 2026

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు

# ప్రతీక బతుకమ్మ పండుగ

**నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

**ఎల్బీనగర్, అక్టోబర్ 18 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను నాగోల్‌లోని తన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా ఇంటి ఆవరణలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మానవ సంబంధానికి, మన సంస్కృతి సంప్రదాయాల వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో అమ్మవారిని పూజించడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య అనుబంధాలకు, సమాజంలో సంతోషాన్ని నింపే గొప్ప పండుగ అని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని



పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సద్దుల బతుకమ్మ పర్వదినం ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్న, కుమారుడు ఉప్పల సాయి కిరణ్, ఉప్పల సాయి తేజ, కోడలు శర్వారీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి

**హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు**

**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్, అక్టోబర్ 18 (జనం సాక్షి):** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను పూజిస్తూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ఆందోళన ఉందని, మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ వ్యవసాయానికి అవసరమైన సమృద్ధి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని గౌరమ్మను ప్రార్థించాలని సూచించారు. బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సును కోరుకునే మహిళలు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కూడా ప్రార్థించాలని అన్నారు. రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు, ఆడపడుచులు అందరూ కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళలు, ఆడపడుచులు పాల్గొన్నారు.



# జూరాల ప్రాజెక్టులో నిలిచిన చేప పిల్లల విడుదల

**గడ్డుకాలంలో మత్స్యకార కుటుంబాలు**

**ధరూరు, అక్టోబర్ 18 (జనం సాక్షి):** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలో 2026 సంవత్సరానికి సంబంధించి ఉచిత చేప పిల్లల పంపిణీ, విడుదల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడం పట్ల స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా నైరుతి రుతుపవనాలు ముగిసి, ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయానికి జలాశయాల్లో చేప పిల్లలను వదలాల్సి ఉంది. అయితే, ప్రస్తుత సీజన్ దాటిపోతున్నా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు వేయకపోవడంపై మత్స్యకార సంఘాలు మండిపడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తక్షణమే జోక్యం చేసుకుని జూరాల ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేయించాలని గంగపుత్రులు, స్థానిక మత్స్యకార కుటుంబాలు బలంగా డిమాండ్ చేస్తున్నాయి. సీజన్ ముగుస్తున్నా జాడ లేని పంపిణీని నైరుతి రుతుపవనాలు ముగిసి ఈశాన్య రుతుపవనాల కాలం వచ్చినా జూరాల ప్రాజెక్టులో చేప పిల్లల



విడుదల ప్రక్రియ ప్రారంభానికి నోచుకోలేదు. తీవ్ర ఆందోళనలో మత్స్యకార సంఘాలు ఉన్నాయని, సకాలంలో చేప పిల్లలను వదలకుంటే రాబోయే రోజుల్లో వేట తగ్గి, తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సి వస్తుందని సొసైటీ సభ్యులు భయపడుతున్నారు. ఉపాధి కోల్పోయే ప్రమాదం మని జూరాల జలాశయంపైనే ఆధారపడి జీవిస్తున్న వందలాది మత్స్యకార కుటుంబాల జీవనోపాధి ప్రస్తుత అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రశ్నార్థకంగా మారింది. టెండర్ల ప్రక్రియలో జాప్యం వద్దని ప్రభుత్వ సబ్సిడీ పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో టెండర్లు, సరఫరా సకాలంలో జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. పెరుగుతున్న వలసల భయం మని వేట సజావుగా సాగకపోతే మత్స్యకారులు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి వాకిటి శ్రీహరికి విజ్ఞప్తిని, మత్స్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాలని జిల్లా మత్స్య శాఖ అధికారులు జూరాల ప్రాజెక్టును సందర్శించి, క్షేత్రస్థాయి ఇబ్బందులను గమనించి తగిన చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాల సరఫరా ముఖ్యం మని కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నాణ్యమైన చేప పిల్లలను తగిన సంఖ్యలో ప్రాజెక్టులో వదలాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక ప్యాకేజీతో ఆదుకోవాలనీ, జాప్యం వల్ల నష్టపోయిన రోజులకు గానూ ప్రత్యామ్నాయంగా మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కొందరు కోరుతున్నారు. ఆందోళనలు తప్పవని హెచ్చరికనీ, అధికారులు ఇలాగే మౌనం వహిస్తే మత్స్యకార కుటుంబాలన్నింటినీ ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని సంఘాల నేతలు స్పష్టం చేశారు.

# పోలీసు సిబ్బంది ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

- **దుర్గాష్టమి వేళ సీపీ సజ్జనర్ ఆయుధ పూజలు**
- **పోలీసు ఆయుధాలు, పెట్రోలింగ్ వాహనాలకు ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** హైదరాబాద్ పేట్ల బురుజులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా నవరాత్రి దుర్గాష్టమి సందర్భంగా నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్, ఆదివారం ఆయుధ, వాహన పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మరీలోని ఆయుధాలకు, నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందించే పోలీస్ పెట్రోలింగ్ వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయుధ పూజ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దుర్గామాత దివ్య ఆశీస్సులతో పోలీస్ అధికారులందరూ, సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఉండే సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యు లకు దుర్గాష్టమి, విజయదశమి శుభాకాంక్షలు తెలి యజేశారు. డీసీపీలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్. శ్రీనివాస్, చైతన్యకుమార్, రమణారెడ్డి, రాఘ వేందర్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మహాలక్ష్మి, పండుగ బస్సుల నిర్వహణలో లోటుపాట్లు లేవు

**హరీశ్ రావు ఆరోపణలపై టీజీఎస్ ఆర్టీసీ స్పష్టత**

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** మహాలక్ష్మి పథకం, పండుగ బస్సుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సామాజిక మాధ్యమ వేదికగా సంస్థ నిర్వహణపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది.

పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా టికెట్ ధరల నియంత్రణ, ఇతర నిర్ణయాలు 2003 నాటి జీవో ఆధారంగా నిబంధనల ప్రకారమే తీసుకుంటున్నట్లు తెలిపింది. ప్రయాణికులపై అదనపు భారం మోపకుండా నిబంధనలకు లోబడే నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు వివరించింది.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది.

దసరా సందర్భంగా బస్సు సర్వీసులను తగ్గించలేదని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 7 వేల అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపింది. ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారని పేర్కొంది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది.

# తాగునీరు వృథా చేస్తే ఊరుకోం

**హైదరాబాద్, (జనంసాక్షి):** తాగునీటిని దుర్వినియోగం చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హైదరాబాద్ జలమండలి స్పష్టం చేసింది. నీటి వృథాపై అందిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించారు. కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా అందించే నీటి సరఫరాను కూడా నిలిపివేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఉన్న ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించడంతో పబ్ యాజమాన్యంపై చర్యలు తీసుకున్నారు. జరిమానాతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించి, కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల సరఫరాను నిలిపివేశారు. వేసవిలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరింది. నీటి దుర్వినియోగాన్ని ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నగరంలో ఎక్కడైనా తాగునీటి వృథా లేదా దుర్వినియోగం కనిపిస్తే ప్రజలు జలమండలికి వాట్సాప్: 99499 30003, కస్టమర్ కేర్: 155313 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఫిర్యాదుతో పాటు ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ప్రాంతం, పూర్తి చిరునామాను పంపించాలని సూచించారు.

# పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి బండ్ల గణేశ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబర్ 18 (జనంసాక్షి):** పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు.

# ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ సంబురాలు

**వేడుకలకు హాజరైన విజయ్ దేవరకొండ, రష్మిక**

**హైదరాబాద్, (జనంసాక్షి):** మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ సమీపంలో ట్యాంక్‌బండ్ వద్ద భారీ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వేడుకకు మరింత వన్నె తెచ్చారు. కళాకారులు మహిళలు బతుకమ్మను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు.





**ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుక ట్యాంకుబండ్ వద్ద ఘనంగా జరిగింది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు సీతక్క, సినీ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు హాజరయ్యారు. మన పూర్వీకులు ఇచ్చిన వారసత్వ సంపద సంస్కృతి సంప్రదాయాలు నేటితరానికి అందించాల్సిన బాధ్యత ఉందని వారంతా అభిప్రాయపడ్డారు.

అమరవీరుల స్థూపం నుంచి కళాకారులు, మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మలను ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ వద్దకు తీసుకువచ్చి అక్కడ వారంతా ఆడి పాడారు. ప్రకృతి, పండగలను కాపాడుకుంటూ అందరం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని సీతక్క ఆకాంక్షించారు. నీటి వృథాను అరికట్టి జల వనరులను సంరక్షించుకోడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందేశం ఇచ్చారు. ప్రజలందరికీ బతుకమ్మ పండగ శుభాకాంక్షలు చెప్పిన ఆయన అందరూ సుఖ సంతోషాలతో విరాజిల్లాలని కోరారు.



# తాగునీటి కోసం రాత్రివేళ తండావాసుల ఇబ్బందులు

**ఎడ్లబండిపై ప్రైవేట్ బోర్ల వద్దకు గ్రామస్తుల ప్రయాణం**

**లిసిర్గాపూర్ అక్టోబర్ 18 (జనం సాక్షి):** సిర్గాపూర్ మండలం జెమ్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని తొల్యా తండాలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సరిపడా నీరు రాకపోవడంతో రాత్రివేళ బిందెలతో రోడ్డెక్కి, ప్రైవేటు బోర్ల వద్దకు ఎడ్లబండిపై వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. నిత్యావసరమైన తాగునీటి కోసం ఇంతటి కష్టాలు పడాల్సి రావడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేసవి కాకపోయినా, మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని, ట్యాంక్ లో నీరు నిల్వ లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని తండావాసులు చెబుతున్నారు. అధికారులు నీటి సరఫరాను క్రమబద్ధీకరించి తమ కష్టాలు తొలగించాలని తొల్యా తండావాసులు కోరుతున్నారు. వెంటనే స్పందించి పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టి, రోజూ తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# రేషన్ బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్

**మల్దకల్ అక్టోబర్ 18 (జనంసాక్షి):** తెలంగాణలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రేషన్ బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్లు ఏర్పాటు చేసే విధానాన్ని పౌరసరఫరాల శాఖ ప్రవేశపెట్టింది.



క్యూఆర్ కోడ్ల ద్వారా బియ్యం సరఫరాపై పర్యవేక్షణ పెంచి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవడంస్వాగతించదగిన విషయం. నవంబర్ నెలలో రేషన్ బియ్యం బస్తాలపై కోడు బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370